www.aashwi.net / in
PRGI NO. TGMUL/26/A2874

# ఆశ్వి అప్డేట్స్

AASHWI UPDATES ENGLISH | TELUGU | HINDI DAILY

ఆదివారం, 19-07-2026 | రంగారెడ్డి Rangareddy | సంపుటి : 01 Volume : 01 | సంచిక :80 Issue : 80 | పేజీలు :08 pages :08 | వెల : రూ.02 price : ₹.02 | www.aashwi.net/in

## ఉప్పుకు రంగు కలిపి డీఏపీగా విక్రయం..
## రైతుల ప్రాణాలతో చెలగాటం



3



## జాన్వీ కపూర్ తమిళ ఎంట్రీ ఫిక్స్!

8



## 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క'..

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- 70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్
- నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ
- హామీలు నెరవేర్చకపోతే యువతే తీర్పు చెబుతుందన్న వ్యాఖ్య
- యువ సంగ్రామ సదస్సులో మాట్లాడిన కేటీఆర్

2

## టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది: కేటీఆర్

- శ్రీహరికోట నుంచి రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్
- టీహబ్ నుంచే స్కైరూట్ పురుడు పోసుకుందన్న కేటీఆర్

2



# అందెశ్రీ స్ఫూర్తే ప్రజా ప్రభుత్వానికి శ్రీరామరక్ష

- అందెశ్రీ నాకు కవి మాత్రమే కాదు, పెద్దన్నలాంటి ఆత్మబంధువు.
- నేను సీఎం స్థాయికి రావడం వెనుక ఆయన గళం, స్ఫూర్తి ఉన్నాయి.
- అందెశ్రీ, గద్దర్ స్ఫూర్తితోనే మా ప్రభుత్వం నడుస్తోంది.
- తెలంగాణపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తే మళ్లీ ఉద్యమకారులు పుడతారు.
- పార్టీలు చూడకుండా ఉద్యమ వీరుల కుటుంబాలకు కోటి రూపాయల ప్రజా సొమ్ము అందించాం.
- 'జయ జయహే తెలంగాణ' లాంటి ఆయన పాటలు సమాజాన్ని రగిలించిన ఉద్యమ ఫిరంగులు.

5

## మహిళల కోసం మరో ఇండస్ట్రియల్ పార్క్: సీఎం రేవంత్ రెడ్డి

- FLO ప్రధాన కార్యాలయానికి 1,000 గజాల స్థలం కేటాయింపు
- ఫిక్కీకి ఫ్యూచర్ సిటీలో మరో ఎకరం.. మహిళల కోసం కొత్త ఇండస్ట్రియల్ పార్క్ పరిశీల

5




## భారత అంతరిక్ష రంగంలో నేడు చారిత్రక ఘట్టం

- భారత్ తొలి ప్రైవేటు కక్ష్య రాకెట్ 'విక్రమ్-1' నేడు నింగిలోకి
- స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతిష్ఠాత్మక ప్రయోగం.. అంతరిక్ష రంగంలో కొత్త శకానికి నాంది
- 'యువత ప్రతిభకు ప్రతీక.. భారత అంతరిక్ష సంస్కరణల ఫలితం' – ప్రధాని నరేంద్ర మోదీ

3





## రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు.. త్వరలోనే రెండో విడత

ప్రతి పేద కుటుంబానికి పక్కా ఇల్లు అందిస్తామన్న కోమటిరెడ్డి
ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగుతోందని వ్యాఖ్య
పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామన్న మంత్రి వెంకట్ రెడ్డి

3

## పవన్ కల్యాణ్ ను పరామర్శించిన లోకేశ్..

- గతంలో పవన్ భుజానికి గాయం
- ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స
- కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి
- పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్

3





## ఉనికి గల్లంతవుతుందనే భయంతోనే కేటీఆర్ అబద్ధాలు

- కేటీఆర్ యువజన సభలో ఉన్నది నిరుద్యోగులు కాదు.. అంతా పెయిడ్ ఆర్టిస్టులే!
- గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. పక్కాగా పేపర్ లీకేజీల పాలన.
- జిరాక్స్ సెంటర్లలో ప్రభుత్వ ఉద్యోగాల క్వశ్చన్ పేపర్లు అమ్ముకున్న ఘనత కేటీఆర్‌దే.
- సొంత బంధువులకు పరీక్షా కేంద్రాల బాధ్యతలు అప్పగించి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడారు.
- కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత కలిసి నిరుద్యోగులను తీవ్రంగా వంచించారు

2


## ఉద్యోగాలు వెతికేవారిగా కాదు.. ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదగాలి

- యువత రాజకీయాల్లోకి రావాలి.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి: ఎంపీ ఈటల రాజేందర్

2



## 'విక్రమ్1' విజయంతో భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర



3



## వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ. 900 కోట్లు

- రోడ్ల సౌకర్యంతోనే పరిశ్రమలు, వ్యాపారాల అభివృద్ధి
- వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ. 900 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు

3






## బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ భూసేకరణ ఉద్రిక్తం

- భారీ పోలీసు బందోబస్తు నడుమ ఫెన్సింగ్ పనులు చేపట్టిన రెవెన్యూ, హైడ్రా అధికారులు
- 'భూమికి భూమి ఇవ్వాల్సిందే' అంటూ సాగుభూముల స్వాధీనంపై రైతుల తీవ్ర నిరసన


2

## గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

- ఎల్‌నినో ప్రభావం వల్ల వరికి బదులు తక్కువ నీటి మెట్ట పంటలు వేయాలని రైతులకు మంత్రి పిలుపు.
- కూసుమంచి మండలంలో రోడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన

2





## ఉద్యోగాలు వెతికేవారిగా కాదు.. ఉద్యోగాలు ఇచ్చేవారిగా ఎదగాలి



- యువత రాజకీయాల్లోకి రావాలి.. దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలి: ఎంపీ ఈటల రాజేందర్

హైదరాబాద్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:

నాగోల్‌లోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన యువ భారత్ కాన్‌క్లేవ్ కార్యక్రమంలో మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. శ్రేయాస్, గీతాంజలి, మల్లారెడ్డి విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో యువత అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ పలు సూచనలు చేశారు. తెలంగాణ రాష్ట్రం కోసం ఎన్నో ఆశయాలతో పోరాడామని, ఇంకా సాధించాల్సిన లక్ష్యాలు చాలా ఉన్నాయని ఈటల అన్నారు. తాము కష్టాలను అనుభవించి ఎదిగిన వారమని, అందుకే ప్రభుత్వంలో ఉన్న సమయంలో కష్టపడే వర్గాల కోసం అనేక సంక్షేమ పథకాలను అమలు చేశామని చెప్పారు. కోవిడ్ మహమ్మారి సమయంలో పీపీఈ కిట్ ధరించి తొలి కరోనా రోగిని స్వయంగా కలిసి ధైర్యం చెప్పానని, నాయకత్వం అంటే ప్రజల కష్టకాలంలో ముందుండి బాధ్యత తీసుకోవడమేనని పేర్కొన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత పదేళ్లలో దేశం అన్ని రంగాల్లో విశేష అభివృద్ధి సాధించిందని పేర్కొన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా యువత పారిశ్రామికవేత్తలుగా మారి నలుగురికి ఉపాధి కల్పించే సంస్థలను స్థాపించాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం ఇంక్యుబేషన్ కేంద్రాల ద్వారా పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్నారని, కుటుంబంలో తల్లి చదువుకున్నట్లయితే పిల్లల భవిష్యత్తు మరింత మెరుగ్గా ఉంటుందని చెప్పారు. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. తన చిన్ననాటి అనుభవాలను గుర్తు చేసుకుంటూ, హుజూరాబాద్ నుంచి చిన్న వయసులోనే ఒంటరిగా బస్సు, రైలులో హైదరాబాద్‌కు వచ్చేవాడినని, కానీ ఇప్పుడు తల్లిదండ్రులు పిల్లలను హాస్టల్ వరకు తీసుకెళ్తున్నారని అన్నారు. పిల్లలకు కొంత స్వేచ్ఛ, బాధ్యత ఇస్తేనే మానసిక దృఢత్వం పెరుగుతుందని, లేకపోతే చిన్న సమస్యలకే కుంగిపోయే పరిస్థితి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. భారత్ యువశక్తి కలిగిన దేశమని, యువత తమ ప్రతిభను, నైపుణ్యాలను పెంపొందించుకుని దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాజకీయాలను బురదగా భావించకుండా చదువుకున్న యువత రాజకీయాల్లోకి వస్తే దేశంలో, సమాజంలో గుణాత్మక మార్పులు తీసుకురాగలరని ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

## బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ భూసేకరణ ఉద్రిక్తం

- భారీ పోలీసు బందోబస్తు నడుమ ఫెన్సింగ్ పనులు చేపట్టిన రెవెన్యూ, హైడ్రా అధికారులు
- 'భూమికి భూమి ఇవ్వాల్సిందే' అంటూ సాగుభూముల స్వాధీనంపై రైతుల తీవ్ర నిరసన
- రైతుల ఆందోళనకు మద్దతుగా నిలిచిన రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు
- అధికారుల తీరుపై ఆగ్రహం.. ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేసిన నిరసనకారులు
- పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు అదనపు బలగాల మోహరింపు.. బహదూర్‌గూడలో తీవ్ర ఉద్రిక్తత

హైదరాబాద్/శంషాబాద్, ఆశ్వి అప్డేట్స్:

రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూసేకరణ ప్రక్రియ మరోసారి ఉద్రిక్తతకు దారితీసింది. ప్రాజెక్టు కోసం భూములకు ఫెన్సింగ్ ఏర్పాటు చేసేందుకు రెవెన్యూ, హైడ్రా అధికారులు భారీ పోలీసు బందోబస్తుతో పనులు చేపట్టగా, తమ సాగు భూములను స్వాధీనం చేసుకోవడాన్ని వ్యతిరేకిస్తూ రైతులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి సాగు చేస్తున్న భూములను ప్రత్యామ్నాయంగా భూమికి భూమి ఇవ్వకుండా స్వాధీనం చేసుకోవడాన్ని అంగీకరించబోమని రైతులు స్పష్టం చేశారు. ఆర్డీవో వచ్చి తమ సమస్యలపై హామీ ఇచ్చే వరకు ఫెన్సింగ్ పనులను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ఆందోళనకు రంగారెడ్డి జిల్లా బీజేపీ నాయకులు, కార్యకర్తలు మద్దతు తెలుపుతూ నిరసనలో పాల్గొన్నారు.

అయితే రైతులు, ప్రజాప్రతినిధుల అభ్యంతరాలను పట్టించుకోకుండా అధికారులు ఫెన్సింగ్ పనులను కొనసాగించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఆగ్రహించిన రైతులు, నిరసనకారులు ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను ధ్వంసం చేశారు.

దీంతో నిరసనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు ప్రయత్నించగా, కొందరు స్థానికులు కారప్పొడి చల్లినట్లు సమాచారం. ఈ ఘటనలో పోలీసులు ఇబ్బందులకు గురికాగా, పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు అదనపు బలగాలను మోహరించారు. చివరకు ఆందోళన చేస్తున్న రైతులు, బీజేపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఘటనతో బహదూర్‌గూడలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



# గురుకులాల టెండర్ల అవినీతిపై చర్చకు సిద్ధం

- ఎల్‌నినో ప్రభావం వల్ల వరికి బదులు తక్కువ నీటి మెట్ట పంటలు వేయాలని రైతులకు మంత్రి పిలుపు.
- కూసుమంచి మండలంలో రోడ్లు, పంచాయతీ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన.
- అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ.
- అనారోగ్య బాధితులు 111 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల అందజేత.

కూసుమంచి , ఆశ్వి అప్డేట్స్:

ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు సంప్రదాయ సాగు విధానాలపై మొండిపట్టు వీడి, మారుతున్న ప్రకృతి పరిస్థితులకు అనుగుణంగా సాగు విధానాలను మార్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సూచించారు. అధిక నీటి అవసరం ఉండే పంటల సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ మెట్ట పంటలపై దృష్టి సారించాలని రైతులకు పిలుపునిచ్చారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో మంత్రి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

Also Read జాన్వీ కపూర్ తమిళ ఎంట్రీ ఫిక్స్!

**రూ.4.61 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

మండల పర్యటనలో భాగంగా మల్లాయిగూడెంలో రూ.2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్‌పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు భూమిపూజ చేశారు. అలాగే రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ.1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్‌పీ కాలువ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అగ్రహారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ భవనానికి కూడా భూమిపూజ నిర్వహించారు. మొత్తం రూ.4.61 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.

**177 మంది లబ్ధిదారులకు సంక్షేమ చెక్కుల పంపిణీ..**

అనంతరం కూసుమంచిలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో సంక్షేమ పథకాల లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 66 మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేశారు. అలాగే వివిధ అనారోగ్య సమస్యలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 111 మంది బాధితులకు రూ.35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను** పంపిణీ చేశారు.



**రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది..**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తోందని చెప్పారు. ఇప్పటికే రైతు భరోసా ద్వారా అన్నదాతలకు ఆర్థిక అండ అందించామని తెలిపారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని రైతులకు సూచించారు. అధిక నీటి అవసరమయ్యే వరి వంటి పంటలకు బదులుగా జొన్న, సజ్జ, రాగులు, పెసర, మినుము, కంది, నువ్వులు వంటి తక్కువ నీటితో సాగయ్యే మెట్ట పంటల సాగును ప్రోత్సహించాలని అన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు శాస్త్రీయ పద్ధతులను అనుసరిస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని పేర్కొన్నారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం..**

ప్రజా ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డుల జారీ వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పారు. మొదటి విడత ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ పూర్తయిందని, త్వరలో రెండో విడత ఇళ్లను మంజూరు చేస్తామని తెలిపారు. అనంతరం మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని హామీ ఇచ్చారు. రైతు భరోసా పథకం కింద ఎకరాకు రూ.6 వేల చొప్పున రైతుల ఖాతాల్లో జమ చేశామని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు.

**పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు..**

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, పీఆర్ ఈఈ వెంకట్‌రెడ్డి, హౌసింగ్ పీడీ శ్రీనివాస్, కూసుమంచి తహసీల్దార్ సైదులు, ఎంపీడీవో సిలార్ సాహెబ్, మద్దినేని స్వర్ణకుమారి, వివిధ గ్రామాల సర్పంచులు, క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి భీమిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సీడీసీ చైర్మన్ ఎరబోలు సూర్యనారాయణరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బజ్జూరి వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ బానోత్ శ్రీనివాస్ నాయక్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 'ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క'..

- సీఎం రేవంత్‌కు కేటీఆర్ సవాల్
- ఉద్యోగాలపై కాంగ్రెస్‌ను నిలదీసిన కేటీఆర్
- 70 వేల ఉద్యోగాలపై బహిరంగ సవాల్
- నోటిఫికేషన్లు కాదు.. లూటిఫికేషన్ జరుగుతోందని విమర్శ
- హామీలు నెరవేర్చకపోతే యువతే తీర్పు చెబుతుందన్న వ్యాఖ్య

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

యువ సంగ్రామ సదస్సులో మాట్లాడిన కేటీఆర్ తెలంగాణలో ఉద్యోగాల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం యువతను మోసం చేసిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఎన్నికల హామీలు అమలు చేయకుండా ఉద్యోగ 'నోటిఫికేషన్ల' స్థానంలో 'లూటిఫికేషన్లు' చేస్తున్నారని విమర్శించారు. సరూర్‌నగర్‌లో నిర్వహించిన 'యువ సంగ్రామ' సదస్సులో మాట్లాడిన ఆయన.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ''రేవంత్ గుర్తు పెట్టుకో.. నీ క్లైమాక్స్ హిట్లర్ కంటే దారుణంగా ఉంటుంది'' అని హెచ్చరించారు. ''ఇప్పటి వరకు ఒక లెక్క.. ఇక నుంచి మరో లెక్క. కాంగ్రెస్ ప్రభుత్వానికి యువతే తగిన గుణపాఠం చెబుతుంది. ప్రజలు, నిరుద్యోగ యువత ఈ అవమానాలను ఎప్పటికీ మర్చిపోరు'' అని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టో ప్రపంచంలోనే అతిపెద్ద మోసమని ఆరోపించారు. ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని అశోక్‌నగర్‌లో ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని, కానీ అధికారంలోకి



వచ్చిన తర్వాత ఆ హామీలను విస్మరించారని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు ఉద్యోగాల క్యాలెండర్‌ను పక్కనపెట్టి జేబులు నింపుకోవడంపైనే దృష్టి పెట్టారని ఎద్దేవా చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు 70 వేల ఉద్యోగాలు నిజంగానే ఇచ్చి ఉంటే.. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లతో సహా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. అలా నిరూపిస్తే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకొని రాహుల్ గాంధీకి జై కొడతానని ప్రకటించారు. ఈ సభ కాంగ్రెస్ చేసిన 'మహాద్రోహాన్ని' యువతకు గుర్తు చేసేందుకేనని అన్నారు. ఉద్యోగాలు అడిగిన యువతపై పోలీసులు దాడులు చేయడం దారుణమని కేటీఆర్ మండిపడ్డారు. యువత ఆకాంక్షలను అర్థం చేసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అహంకారంతో వ్యవహరిస్తోందని విమర్శించారు. కేసీఆర్ హయాంలో జారీ చేసిన నోటిఫికేషన్లకే ఇప్పుడు నియామక పత్రాలు ఇచ్చి రేవంత్ రెడ్డి ప్రభుత్వం క్రెడిట్ తీసుకుంటోందని కేటీఆర్ ఆరోపించారు. ఒక మంత్రి ఒక మాట, మరో మంత్రి మరో మాట చెబుతూ ఉద్యోగాల విషయంలో ప్రజలను గందరగోళానికి గురిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో భూములు, ఇసుక లూటీ జరుగుతోందని, ప్రజలు హామీల గురించి ప్రశ్నిస్తే వారిని అవమానిస్తున్నారని విమర్శించారు.


## టీ-హబ్ బేబీ 'స్కైరూట్' చరిత్ర సృష్టించింది: కేటీఆర్

- శ్రీహరికోట నుంచి రాకెట్ ను విజయవంతంగా ప్రయోగించిన స్కైరూట్
- టీహబ్ నుంచే స్కైరూట్ పురుడు పోసుకుందన్న కేటీఆర్
- ఆ సంస్థ ఇప్పుడు గ్లోబల్ స్థాయికి ఎదగడం అందరికి స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

హైదరాబాద్ సరూర్ నగర్ వేదికగా జరిగిన 'యువ సంగ్రామ సదస్సు'లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇవాళ నమోదైన కీలక అంతరిక్ష విజయాన్ని పంచుకున్నారు. దేశంలోనే తొలిసారిగా శ్రీహరికోట నుంచి ప్రైవేట్ రాకెట్ 'విక్రమ్ 1' విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుత రికార్డు సృష్టించిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ మరెక్కడో కాదు.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 'టీహబ్' వేదికగానే పురుడు పోసుకుందని గర్వంగా ప్రకటించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏళ్లు పూర్తయిన తరుణంలో... దేశ చరిత్రలోనే సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తూ ఒక ప్రైవేట్ రాకెట్‌ను అంతరిక్షంలోకి పంపిన ఘనత స్కైరూట్ కంపెనీకే దక్కుతుందని కేటీఆర్ కొనియాడారు. మన హైదరాబాద్‌లోని టీహబ్ వేదికగా స్టార్టప్‌గా ప్రస్థానం మొదలుపెట్టిన ఒక సంస్థ, ఇవాళ ప్రపంచ స్థాయిలో దేశం గర్వించేలా ఎదగడం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమన్నారు.

శ్రీహరికోట సతీశ్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి ఈ ప్రయోగం అత్యంత విజయవంతంగా ముగిసిందని కేటీఆర్ తెలిపారు. ఈ చరిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించిన స్కైరూట్ టీమ్‌కు సభకు హాజరైన నిరుద్యోగ యువత, విద్యార్థులంతా చప్పట్లతో ఘనంగా అభినందనలు తెలపాలని అన్నారు. మరోవైపు, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ ఇస్రో సహకారంతో ప్రైవేట్ రంగానికి చెందిన తొలి దేశీయ రాకెట్ ప్రయోగం సక్సెస్ కావడంతో... అటు ఇస్రో సైంటిస్టులతో పాటు ఇటు స్కైరూట్ కంట్రోల్ సెంటర్‌లోనూ పండుగ వాతావరణం నెలకొంది.




# ఉనికి గల్లంతవుతుందనే భయంతోనే కేటీఆర్ అబద్ధాలు

- కేటీఆర్ యువజన సభలో ఉన్నది నిరుద్యోగులు కాదు.. అంతా పెయిడ్ ఆర్టిస్టులే!
- గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన.. పక్కాగా పేపర్ లీకేజీల పాలన.
- జిరాక్స్ సెంటర్లలో ప్రభుత్వ ఉద్యోగాల క్వశ్చన్ పేపర్లు అమ్ముకున్న ఘనత కేటీఆర్‌దే.
- సొంత బంధువులకు పరీక్షా కేంద్రాల బాధ్యతలు అప్పగించి నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడారు.
- కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత కలిసి నిరుద్యోగులను తీవ్రంగా వంచించారు.

హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్

హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిర్వహించిన యువజన సభపై రాష్ట్ర ప్రభుత్వ విప్, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేటీఆర్ తన సభలో అసలైన నిరుద్యోగులతో కాకుండా, కేవలం పెయిడ్ ఆర్టిస్టులను పెట్టుకుని మాట్లాడిస్తున్నారని ఎద్దేవా చేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలన మొత్తం పేపర్ లీకేజీల పాలనగా మారిందని మండిపడ్డారు. కేటీఆర్ ది పూర్తిగా పాపాల చిట్టా అని, వారి హయాంలో జిరాక్స్ సెంటర్లలో సైతం ప్రభుత్వ ఉద్యోగాల క్వశ్చన్ పేపర్లు అమ్ముకున్న దుస్థితి నెలకొందని ఆరోపించారు. పరీక్షా కేంద్రాల బాధ్యతలను సైతం తమ సొంత బంధువులకు అప్పగించి నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్నారని ధ్వజమెత్తారు.



**67,700 మందికి ఉద్యోగాలిచ్చాం.. వాస్తవం కాదా**

బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులను కేటీఆర్, ఆయన తండ్రి కేసీఆర్, బావ హరీష్ రావు, చెల్లెలు కవిత కలిసి తీవ్రంగా వంచించారని అడ్లూరి లక్ష్మణ్ ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత శిల్పకళావేదిక వేదికగా రికార్డు స్థాయిలో 67,700 మంది నిరుద్యోగులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. అలాగే ఎల్బీ నగర్ స్టేడియంలో వేలాది మందికి ఉద్యోగ పత్రాలు ఇచ్చిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వానిదేనన్నారు. గతంలో యువతను రెచ్చగొట్టి పబ్బం గడుపుకున్న బీఆర్ఎస్ నేతలు, ఎప్పుడైనా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల సాధకబాధల్లో పాలు పంచుకున్నారా అని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి ఎల్లప్పుడూ యువత పక్షాన నిలబడి పనిచేస్తున్నారని స్పష్టం చేశారు.

**మీ ఉనికి గల్లంతవుతుందనే భయంతోనే అబద్ధాలు**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి, భవిష్యత్తులో తమ రాజకీయ ఉనికి పూర్తిగా గల్లంతవుతుందనే భయంతోనే కేటీఆర్ పదే పదే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై అడ్డగోలు అబద్ధాలు మాట్లాడుతున్నారని మంత్రి దుయ్యబట్టారు. సీఎంపై విమర్శలు చేసే ముందు, జైల్లో ఉన్న తన సొంత సోదరి కవిత పెడుతున్న శాపనార్థాలకు, ఆమె మాటలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సొంత తోడబుట్టిన చెల్లెలే శాపనార్థాలు పెట్టే స్థితికి కేటీఆర్ దిగజారారని విమర్శించారు. కేటీఆర్ ఎన్ని డ్రామాలు ఆడినా తెలంగాణ యువత, ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, రాబోయే రోజుల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమని అడ్లూరి లక్ష్మణ్ హెచ్చరించారు.

## రూ.5 లక్షలతో పక్కా ఇళ్లు..
# త్వరలోనే రెండో విడత

**తెలంగాణ, ఆశ్వి అప్డేట్స్**

తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు అనేవే లేకుండా చేస్తామని, అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత పక్కా ఇల్లు అందిస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగుతోందని ఆయన కొనియాడారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో రూ.184.15 కోట్ల భారీ వ్యయంతో చేపట్టనున్న రోడ్ల అభివృద్ధి పనులకు మంత్రులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పరిగి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించిన అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రులు కీలక వివరాలను వెల్లడించారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇళ్లు లేని పేద ప్రజలు సొంతంగా పక్కా ఇంటిని నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందిస్తోందని కోమటిరెడ్డి తెలిపారు. త్వరలోనే అర్హులైన మిగతా వారందరికీ ఇళ్లు ఇచ్చేందుకు రెండో విడత కార్యక్రమాన్ని కూడా ప్రారంభిస్తామన్నారు. వికారాబాద్ జిల్లాలో రోడ్ల నెట్‌వర్క్ బలోపేతం కోసం రూ.900 కోట్ల నిధులు మంజూరు చేయించామని, అందులో నుంచే పరిగి నియోజకవర్గానికి రూ.184.15 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. రవాణా వ్యవస్థ మెరుగైతేనే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉపాధి పెరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి తీరుతామని మాట ఇచ్చిన మంత్రి కోమటిరెడ్డి... నిరుపేదలకు కొత్త రేషన్ కార్డులతో పాటు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని గుర్తుచేశారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500లకే గ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమ పథకాలను విజయవంతంగా కొనసాగిస్తున్నామని వివరించారు.




# 'విక్రమ్-1' విజయంతో భారత అంతరిక్ష రంగంలో కొత్త చరిత్ర


- **స్కైరూట్ బృందానికి ప్రధాని మోదీ అభినందనలు.. ప్రైవేటు రంగానికి ఇది కీలక మైలురాయి**

**న్యూఢిల్లీ, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

భారత్ తొలి ప్రైవేటు కక్ష్య ప్రయోగ వాహనం 'విక్రమ్ 1' విజయవంతంగా ప్రయోగం కావడంతో ప్రధాని నరేంద్ర మోదీ స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి అభినందనలు తెలిపారు. ప్రయోగం అనంతరం స్కైరూట్ ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడిన ప్రధాని, ఈ విజయాన్ని భారత అంతరిక్ష ప్రయాణంలో చారిత్రక ఘట్టంగా అభివర్ణించారు.

అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం కొత్త అవకాశాలకు నాంది పలుకుతోందని, ఆవిష్కరణలు మరింత వేగవంతం అవుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు. భారత యువత ప్రతిభ, సాంకేతిక సామర్థ్యం ప్రపంచ వేదికపై మరోసారి నిరూపితమైందన్నారు.

'విక్రమ్ 1' విజయం యువతలో పెద్ద లక్ష్యాలు పెట్టుకుని, నిర్భయంగా ఆవిష్కరణల దిశగా ముందుకు సాగే స్ఫూర్తిని నింపుతుందని ప్రధాని మోదీ తెలిపారు. భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర మరింత విస్తరించేందుకు ఈ ప్రయోగం కొత్త దిశను చూపిందని ఆయన పేర్కొన్నారు.



# భారత అంతరిక్ష రంగంలో నేడు చారిత్రక ఘట్టం

- **భారత్ తొలి ప్రైవేటు కక్ష్య రాకెట్ 'విక్రమ్-1' నేడు నింగిలోకి**
- **స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతిష్ఠాత్మక ప్రయోగం.. అంతరిక్ష రంగంలో కొత్త శకానికి నాంది**
- **'యువత ప్రతిభకు ప్రతీక.. భారత అంతరిక్ష సంస్కరణల ఫలితం' – ప్రధాని నరేంద్ర మోదీ**

**న్యూఢిల్లీ, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

భారత అంతరిక్ష చరిత్రలో మరో స్వర్ణ అధ్యాయానికి నేడు తెరలేవనుంది. దేశంలోనే తొలి ప్రైవేటు సంస్థ అభివృద్ధి చేసిన కక్ష్య ప్రయోగ వాహనం *'విక్రమ్ 1'*ను స్కైరూట్ ఏరోస్పేస్ నేడు ఉదయం 11:30 గంటలకు ప్రయోగించనుంది. భారత అంతరిక్ష రంగంలో ప్రభుత్వ సంస్థ ఇస్రోతో పాటు ప్రైవేటు రంగం కూడా ప్రపంచస్థాయి ప్రయోగ సామర్థ్యాన్ని ప్రదర్శించగలదనే విషయాన్ని ఈ మిషన్ ప్రపంచానికి చాటనుంది. భారత అంతరిక్ష రంగాన్ని కొత్త శకంలోకి తీసుకెళ్లే అత్యంత కీలక మైలురాయిగా ఈ ప్రయోగాన్ని శాస్త్రవేత్తలు అభివర్ణిస్తున్నారు. నాలుగు దశలతో రూపొందించిన విక్రమ్ 1 రాకెట్‌ను తక్కువ సమయంలో, తక్కువ వ్యయంతో ఉపగ్రహాలను భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టేలా అత్యాధునిక సాంకేతికతతో రూపొందించారు. ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న చిన్న ఉపగ్రహాల ప్రయోగ అవసరాలను తీర్చే లక్ష్యంతో ఈ వాహనాన్ని అభివృద్ధి చేశారు. వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల రంగంలో భారతదేశానికి కొత్త అవకాశాలను సృష్టించడమే కాకుండా, అంతర్జాతీయ మార్కెట్లో భారత ప్రైవేటు అంతరిక్ష సంస్థలకు పోటీ సామర్థ్యాన్ని కల్పించనుంది. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ దేశ ప్రజలకు సందేశం ఇస్తూ, "భారత అంతరిక్ష ప్రయాణంలో ఇది చారిత్రక కొత్త అధ్యాయం. విక్రమ్ 1 ప్రయోగం మన యువత ప్రతిభ, సంకల్పం, ఆవిష్కరణ శక్తికి ప్రతీక. అంతరిక్ష రంగంలో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు కొత్త అవకాశాలకు మార్గం సుగమం చేశాయి. స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి నా హృదయపూర్వక శుభాకాంక్షలు. విక్రమ్ 1 విజయవంతంగా చరిత్ర సృష్టించి భావితరాలకు స్ఫూర్తిగా నిలవాలని కోరుకుంటున్నాను" అని పేర్కొన్నారు. అలాగే, ఈ చారిత్రక ప్రయోగాన్ని దేశ ప్రజలందరూ, ముఖ్యంగా యువత ప్రత్యక్షంగా వీక్షించాలని, #IndiaWithVikram1 హ్యాష్‌ట్యాగ్‌తో స్కైరూట్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేయాలని ప్రధాని పిలుపునిచ్చారు. విక్రమ్ 1 ప్రయోగం విజయవంతమైతే, భారత అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల పాత్ర మరింత విస్తరించడంతో పాటు, దేశాన్ని ప్రపంచ వాణిజ్య అంతరిక్ష ప్రయోగాల కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ఇది కీలక ముందడుగుగా నిలవనుంది.




# ఉప్పుకు రంగు కలిపి డీఏపీగా విక్రయం..
# రైతుల ప్రాణాలతో చెలగాటం

- **మఠంపల్లి పోలీసుల దాడుల్లో పెదఅంబర్‌పేటలో నకిలీ ఎరువుల తయారీ కేంద్రం సీజ్.. 10 వేల బస్తాలు స్వాధీనం**

**మఠంపల్లి/హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్:**

రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం సాగిస్తున్న నకిలీ ఎరువుల ముఠాను మఠంపల్లి పోలీసులు ఛేదించారు. మఠంపల్లి మండలం రఘునాథపాలెంలో వెలుగులోకి వచ్చిన నకిలీ డీఏపీ ఎరువుల కేసు దర్యాప్తు హైదరాబాద్‌లోని పెదఅంబర్‌పేట వరకు చేరగా, అక్కడ కోళ్ల ఫారంలో రహస్యంగా నడుస్తున్న నకిలీ ఎరువుల తయారీ కేంద్రాన్ని పోలీసులు గుర్తించి సీజ్ చేశారు.

**రైతు ఫిర్యాదుతో వెలుగులోకి మోసం**

రఘునాథపాలెంలోని ఓ ఎరువుల దుకాణంలో డీఏపీ ఎరువులు కొనుగోలు చేసిన రైతుకు వాటి నాణ్యతపై అనుమానం రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో హుజూర్‌నగర్ సీఐ జి. చరమందరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం దర్యాప్తు ప్రారంభించింది. ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించి, సరఫరా గొలుసును అనుసరించగా అసలు గుట్టు బయటపడింది.




**పెదఅంబర్‌పేటలో అక్రమ తయారీ కేంద్రం**

దర్యాప్తులో నకిలీ ఎరువుల తయారీ కేంద్రం హైదరాబాద్‌లోని పెదఅంబర్‌పేట హరితహారం కాలనీలో ఉన్నట్లు గుర్తించారు. వెంటనే మఠంపల్లి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ బృందంతో అక్కడికి చేరుకుని దాడులు నిర్వహించారు. కోళ్ల ఫారంను అద్దెకు తీసుకుని గత రెండు నెలలుగా నకిలీ ఎరువులను తయారు చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

**ఉప్పుకు రంగు కలిపి బ్రాండెడ్ ఎరువులుగా ప్యాకింగ్**

తనిఖీల్లో సాధారణ ఉప్పుకు ఎరుపు రంగు కలిపి డీఏపీతో పాటు పలు ప్రముఖ కంపెనీల పేర్లతో నకిలీ ఎరువుల సంచులను తయారు చేస్తున్నట్లు బయటపడింది. తయారీకి ఉపయోగించే యంత్రాలు, ప్యాకింగ్ మెషిన్లు, ఖాళీ సంచులు, రంగు పదార్థాలు, ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

**10 వేల బస్తాలు..**
**కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం**

వ్యవసాయ శాఖ అధికారులు గోదాంను పరిశీలించగా ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండానే కేంద్రం నిర్వహిస్తున్నట్లు తేలింది. గోదాంలో సుమారు 10 వేల నకిలీ ఎరువుల బస్తాలు నిల్వ ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ కోట్ల రూపాయలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గోదాంను సీజ్ చేసి వ్యవసాయ శాఖ అధికారులకు అప్పగించారు.

**మాఫియా మూలాలపై లోతైన దర్యాప్తు**

ఈ నకిలీ ఎరువులు రాష్ట్రంలోని పలు జిల్లాలకు సరఫరా అయ్యాయా? ఈ దందా వెనుక ఉన్న అసలు నిర్వాహకులు ఎవరన్న కోణంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. ఎరువుల తయారీ, నిల్వ, రవాణా, పంపిణీకి సంబంధించిన పూర్తి నెట్‌వర్క్‌ను వెలికితీసే పనిలో ఉన్నారు.

**రైతులకు హెచ్చరిక**

నకిలీ ఎరువుల వల్ల పంటల దిగుబడి తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు హెచ్చరించారు. రైతులు లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే ఎరువులు కొనుగోలు చేయాలని, తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని, అనుమానాస్పద ఎరువులపై వెంటనే వ్యవసాయ శాఖ లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. రైతుల కష్టార్జితాన్ని దోచుకునే నకిలీ ఎరువుల మాఫియాపై కఠిన చర్యలు కొనసాగుతాయని పోలీసులు స్పష్టం చేశారు.

# పవన్ కల్యాణ్ ను పరామర్శించిన నారా లోకేశ్..

- **గతంలో పవన్ భుజానికి గాయం**
- **ఇటీవల ముంబైలో విజయవంతంగా శస్త్రచికిత్స**
- **కొన్ని రోజుల కిందటే ఆసుపత్రి నుంచి డిశ్చార్జి**
- **హైదరాబాదులోని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న వైనం**
- **పవనన్న త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన లోకేశ్**

**హైదరాబాద్, ఆశ్వి అప్డేట్స్**

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శనివారం పరామర్శించారు. ఇటీవల ముంబయిలో భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని హైదరాబాద్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్‌ను లోకేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా "పవనన్న త్వరగా కోలుకోవాలి" అని ఆయన ఆకాంక్షించారు.

పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని లోకేశ్ అడిగి తెలుసుకున్నారు. భుజానికి అయిన గాయం, జరిగిన శస్త్రచికిత్స వివరాలను అడిగారు. వైద్యుల సూచనల మేరకు పూర్తి విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. తన పరామర్శ అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. "డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని పరామర్శించాను. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించాను. వైద్యుల సూచనలు పాటిస్తూ వీలైనంత మేర విశ్రాంతి తీసుకోవాలని సూచించాను" అని తెలిపారు.



గతంలో భుజానికి గాయం కావడంతో పవన్ కల్యాణ్ కొంతకాలంగా ఇబ్బంది పడుతున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ముంబయిలోని కోకిలాబెన్ ఆసుపత్రిలో ఆయన కుడి భుజానికి వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేశారు. ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత ఆయన హైదరాబాద్‌లోనే ఉంటూ విశ్రాంతి తీసుకుంటున్నారు. పలువురు ప్రముఖులు ఆయన నివాసానికి వచ్చి పరామర్శిస్తున్నారు.

# వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ. 900 కోట్లు

- **రోడ్ల సౌకర్యంతోనే పరిశ్రమలు, వ్యాపారాల అభివృద్ధి**
- **వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ. 900 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు.**
- **రోడ్ల సౌకర్యంతోనే పరిశ్రమలు, వ్యాపారాల అభివృద్ధి**

**వికారాబాద్, ఆశ్వి అప్డేట్స్**




వికారాబాద్ జిల్లా రోడ్ల అభివృద్ధికి రూ. 900 కోట్ల నిధులను మంజూరు చేసినట్లు రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి తెలిపారు. శనివారం వికారాబాద్ జిల్లా తాండూరులో రూ. 345.88 కోట్ల వ్యయంతో 143.53 కిలోమీటర్ల పొడవున చేపట్టనున్న 8 హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల నిర్మాణ పనులకు మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి, ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు బుయ్యని మనోహర్ రెడ్డి, కాలె యాదయ్య, జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ రోడ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. అనంతరం జీపీఆర్ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలకు పెద్ద ఎత్తున నిధులను కేటాయించి పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తాండూరు నియోజకవర్గానికి రూ.345.88 కోట్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. రోడ్ల సౌకర్యం మెరుగ్గా ఉంటే పరిశ్రమలు, వ్యాపారాలు అభివృద్ధి చెందడంతో పాటు ఉపాధి అవకాశాలు కూడా మెరుగుపడతాయన్నారు. ప్రజా పాలనలో భాగంగా 30 మాసాల్లో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందని తెలిపారు. మున్ముందు మరిన్ని మంచి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

**కాంగ్రెస్ పాలనలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాలు**

రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు ఇవ్వడంతో పాటు సన్న బియ్యాన్ని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రూ. 500 సబ్సిడీతో గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. మహిళల ఆర్థిక అభివృద్ధికి మహిళా సంఘాలకు రూ.10 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. రైతు భరోసా కింద తొమ్మిది రోజుల్లోనే 900 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలకు జమ చేయడం జరిగిందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను పటిష్ట పరిచే దిశగా యంగ్ ఇండియా పాఠశాలలను స్థాపించడం జరుగుతుందని పేర్కొన్నారు. కోర్టు కేసు పరిష్కారం అయిన వెంటనే 94 కోట్ల వ్యయంతో రైల్వే ఓవర్ వే బ్రిడ్జి పనులను 18 వారాల్లో చేపడతామని హామీ ఇచ్చారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ఆర్థిక వ్యవస్థను మెరుగుపరుస్తూనే వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. రవాణా వ్యవస్థ మెరుగుపరిస్తేనే అభివృద్ధి సాధ్యమని భావించి రూ. 900 కోట్ల వ్యయంతో జిల్లాలో ప్రధాన రహదారుల నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కాగ్నానదిలో మురుగునీరు కలవకుండా రూ. 30 కోట్లను మంజూరు చేసి పనులు మొదలు పెట్టడం జరిగిందని గుర్తు చేశారు. రైతులకు ఇచ్చిన హామీ మేరకు రూ. 2 లక్షల రుణమాఫీ ప్రభుత్వం చేపట్టిందన్నారు. గ్రూప్ 1, గ్రూప్ 2 తదితర పరీక్షలు నిర్వహించి 70 వేల మందికి కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించదని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందిస్తూనే ఉదయం అల్పాహారం సౌకర్యాన్ని కల్పించడం జరిగిందని అన్నారు. తాండూరు మున్సిపల్ పరిధిలో 571 మంది అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా డబుల్ బెడ్ రూమ్‌లను కేటాయించడం జరిగిందని తెలిపారు.

**ప్రత్యేక నిధులతో రోడ్లు, అభివృద్ధి పనులకు శ్రీకారం**

శాసనమండలి చీఫ్ విప్ పి.మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం పేదల అభ్యున్నతికి కృషి చేస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేయబడుతుందన్నారు. వికారాబాద్, రంగారెడ్డి జిల్లాల రోడ్ల అభివృద్ధికి అధిక నిధులు వచ్చాయని, రోడ్ల అభివృద్ధితో రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని పేర్కొన్నారు. కర్ణాటక సరిహద్దు రోడ్లకు నిధులను కేటాయించి అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ద్వారా అధిక నిధులను తీసుకురావడం జరుగుతుందన్నారు. మైనార్టీ సంక్షేమం కోసం 75 కోట్ల వ్యయంతో ఏటీసీని ఏర్పాటు చేసుకోవడం జరిగిందని గత సంవత్సరం 165 మందికి శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. రోడ్ల అభివృద్ధితో బషీరాబాద్‌లో 30 పడకల ఆసుపత్రి, జూనియర్ కళాశాలలను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. వెనుక బడిన తాండూరును అన్ని విధాల అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహమెహ్రా, అదనపు కలెక్టర్లు ఉమాశంకర్ ప్రసాద్, వెంకటాచారి, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ సచిన్ బస్వరాజ్ గుట్టూరు, ఆర్డీఓ అనిత, ఆర్ అండ్ బి ఎస్.ఇ వసంత నాయక్, ఆర్య వైశ్య కార్పొరేషన్ సంస్థ చైర్ పర్సన్ కల్వ సుజాత, మున్సిపల్ చైర్ పర్సన్ నీరజ, మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ధారాసింగ్, మండల పార్టీ అధ్యక్షులు, ప్రజలు పాల్గొన్నారు.





# పోలీస్ నియామకాల్లో పారదర్శకతే తెలంగాణ ప్రత్యేకత

- **పేపర్ లీకేజీకి తావులేదు.. నిష్పాక్షికంగా నియామకాలు కొనసాగాలి: డీజీపీ సి.వి. ఆనంద్**
- **రిక్రూట్‌మెంట్ బోర్డు, ట్రైనింగ్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సర్వీసెస్ విభాగాలపై సమగ్ర సమీక్ష**

**హైదరాబాద్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ పోలీస్ నియామకాల్లో పారదర్శకత, విశ్వసనీయతకు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని, ఈ ప్రమాణాలను భవిష్యత్తులో కూడా మరింత పటిష్ఠంగా కొనసాగించాలని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ అధికారులను ఆదేశించారు. ప్రశ్నాపత్రాల లీకేజీ, అవకతవకలకు ఏమాత్రం అవకాశం లేకుండా నియామక ప్రక్రియను అత్యంత నిష్పాక్షికంగా నిర్వహించాలని స్పష్టం చేశారు.

శనివారం పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, పోలీస్ ట్రైనింగ్, పోలీస్ కమ్యూనికేషన్స్, పోలీస్ కంప్యూటర్ సర్వీసెస్ (PCS) విభాగాల పనితీరుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో డీజీపీ పాల్గొన్నారు. ఆయా విభాగాల అధికారులు ప్రస్తుత కార్యకలాపాలు, సాంకేతిక ఆధునికీకరణ, శిక్షణా కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై ప్రజెంటేషన్లు ఇచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ నూతన కమ్యూనికేషన్ సెట్లను ఆవిష్కరించారు.

సమావేశంలో మాట్లాడిన సి.వి. ఆనంద్, దేశంలోని పలు నియామక సంస్థల్లో ప్రశ్నాపత్రాల లీకేజీలు చోటుచేసుకున్నప్పటికీ తెలంగాణ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో ఇప్పటివరకు ఒక్క పేపర్ లీకేజీ కూడా జరగలేదని తెలిపారు. ఇది బోర్డు పనితీరుకు, అధికారుల నిబద్ధతకు నిదర్శనమని పేర్కొంటూ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులను అభినందించారు.

1989-91లో జరిగిన పోలీస్ సబ్‌ఇన్‌స్పెక్టర్ నియామకాలను గుర్తు చేసుకున్న డీజీపీ, అప్పట్లో కూడా పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చారని, ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానంతో నియామకాలను మరింత విశ్వసనీయంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రతి అభ్యర్థికి సమాన అవకాశాలు కల్పించే విధంగా పరీక్షలు నిర్వహించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

వేలాది పోస్టుల భర్తీ.. కొత్త నోటిఫికేషన్లు కొనసాగుతున్నాయి రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ వి.వి. శ్రీనివాసరావు సమర్పించిన నివేదికలో 2015-16, 2018-19, 2021, 2022-23లో నిర్వహించిన నియామకాల వివరాలను వెల్లడించారు. 2022-23లో రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పోలీస్ నియామక ప్రక్రియ చేపట్టి 16,654 పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు జరిగిన నియామకాల్లో 95 శాతం కానిస్టేబుల్ పోస్టులు, 5 శాతం సబ్‌ఇన్‌స్పెక్టర్ పోస్టులు ఉన్నట్లు వివరించారు. ప్రస్తుతం 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పోస్టులు, 1,743 డ్రైవర్ ఆపరేటర్ పోస్టులు, ఫింగర్‌ప్రింట్ విభాగానికి సంబంధించిన పోస్టుల భర్తీ కొనసాగుతోందని తెలిపారు. తొలిసారిగా చేపట్టిన ఫింగర్‌ప్రింట్ నియామకాల్లో 60 పోస్టులకు 57 మంది ఎంపికయ్యారని వెల్లడించారు. ఆర్టీసీ విభాగానికి సంబంధించిన 198 సూపర్‌వైజర్ పోస్టుల భర్తీ కూడా త్వరలో పూర్తవుతుందని పేర్కొన్నారు.

**సాంకేతికతతో మరింత పారదర్శకత**

రిక్రూట్‌మెంట్ ప్రక్రియలో బయోమెట్రిక్ వెరిఫికేషన్, ఆన్‌లైన్ దరఖాస్తులు, RFID టెక్నాలజీ, మొబైల్, ఈమెయిల్ ఆధారిత రిజిస్ట్రేషన్, పరీక్షల్లో నెగెటివ్ మార్కింగ్ వంటి ఆధునిక విధానాలను అమలు చేస్తున్నట్లు సమావేశంలో వివరించారు. శారీరక పరీక్షల్లో అభ్యర్థులకు అనుకూలంగా మార్పులు తీసుకువచ్చిన విషయాన్ని కూడా ప్రస్తావించారు.

పోలీస్ ట్రైనింగ్, కమ్యూనికేషన్స్, కంప్యూటర్ సర్వీసెస్ విభాగాల్లో సాంకేతిక ఆధునికీకరణ, శిక్షణా ప్రమాణాల పెంపు, డిజిటల్ సేవల విస్తరణపై కూడా డీజీపీ కీలక సూచనలు చేశారు. రాష్ట్ర పోలీస్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా, ప్రజలకు చేరువగా తీర్చిదిద్దేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు.

# ట్రైనీ డీఎస్పీలకు కరీంనగర్ సీపీ గౌష్ ఆలం ప్రత్యేక శిక్షణ

- **'పీఎంజే జ్యువెలరీ' దోపిడీ కేసును కేస్ స్టడీగా వివరించిన పోలీసు అధికారులు**

**హైదరాబాద్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**



తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పొందుతున్న 112 మంది గ్రూప్1 ట్రైనీ డీఎస్పీలకు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన పీఎంజే జ్యువెలరీ దోపిడీ కేసు దర్యాప్తును కేస్ స్టడీగా వివరిస్తూ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ శిక్షణలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం దాదాపు మూడున్నర గంటల పాటు కేసు దర్యాప్తు, సాంకేతిక ఆధారాల సేకరణ, నిందితుల అరెస్టు వరకు జరిగిన ప్రతి కీలక అంశాన్ని ట్రైనీ అధికారులకు వివరించారు.

ఈ సందర్భంగా మాట్లాడిన సీపీ గౌష్ ఆలం, నిందితులు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నేరానికి పాల్పడినా, తెలంగాణ పోలీస్ శాఖ ఆధునిక సాంకేతిక పరికరాలు, డేటా విశ్లేషణ, సమన్వయంతో కేసును విజయవంతంగా ఛేదించిందని తెలిపారు. ఈ విజయం ఒక్కరి కృషి కాదని, పై అధికారుల మార్గదర్శకత్వం, వివిధ రాష్ట్రాల పోలీసుల సహకారం, దర్యాప్తు బృందాల సమష్టి కృషి ఫలితమని పేర్కొన్నారు. ఈ కేసు దర్యాప్తులో తెలంగాణ పోలీస్ ప్రత్యేక బృందాలు బీహార్, పశ్చిమ బెంగాల్, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో విస్తృతంగా గాలింపు చేపట్టి, స్థానిక పోలీసుల సహకారంతో ప్రధాన నిందితులతో పాటు మొత్తం ఎనిమిది మంది నిందితులను అరెస్టు చేసిన విధానాన్ని ట్రైనీ అధికారులకు వివరించారు. శిక్షణలో పాల్గొన్న ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు క్షేత్రస్థాయిలో ఎదురైన సవాళ్లు, నిందితులను గుర్తించడం, ఆధారాలను సేకరించడం, అంతర్రాష్ట్ర సమన్వయం వంటి అంశాలపై తమ అనుభవాలను పంచుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో పాటు క్షేత్రస్థాయి అనుభవం, బృంద సమన్వయం ఉంటేనే క్లిష్టమైన కేసులను ఛేదించడం సాధ్యమవుతుందని తెలిపారు. భవిష్యత్తులో విధుల్లోకి వెళ్లే ట్రైనీ డీఎస్పీలకు ఈ కేస్ స్టడీ ప్రాక్టికల్ మార్గదర్శకంగా ఉపయోగపడుతుందని అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ టౌన్ ఏసీపీ వెంకటస్వామి, రూరల్ ఏసీపీ విజయకుమార్, ఇన్‌స్పెక్టర్లు సృజన్ రెడ్డి, శ్రీనివాస్, రమేష్, తిరుమల్, ప్రకాష్, సరిలాల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో గంజాయి సేవించిన ముగ్గురు యువకులు పట్టివేత

- **యూరిన్ టెస్ట్‌లో పాజిటివ్.. డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలింపు**

**ఖమ్మం, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఖమ్మం III టౌన్ పోలీసులు గంజాయి సేవించిన ముగ్గురు వ్యక్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు చేపట్టారు. మున్నేరు బ్రిడ్జి కింద ప్రకాష్‌నగర్ ప్రాంతంలో నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని విచారించారు. పోలీసుల వివరాల ప్రకారం, అదుపులోకి తీసుకున్నవారు పసుల సూర్యనారాయణ (27), కడసు రాకేష్ (29) ఇద్దరూ కరీంనగర్‌కు చెందినవారు కాగా, మైదం మల్లేష్ (29) జగిత్యాల జిల్లా తిప్పన్నపేట గ్రామానికి చెందిన వ్యక్తి. విచారణలో వీరు సిగరెట్‌లో గంజాయి నింపి సేవించినట్లు అంగీకరించారు. అనంతరం ఇద్దరు మధ్యవర్తుల సమక్షంలో ఇంటిగ్రేటెడ్ EZ Split Key Cup యూరిన్ టెస్ట్ కిట్ ద్వారా పరీక్షలు నిర్వహించగా, ముగ్గురికి గంజాయి వినియోగించినట్లు పాజిటివ్ ఫలితాలు వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

దీంతో చట్టపరమైన నిబంధనల మేరకు కేసు నమోదు చేసి, న్యాయస్థానం ఆదేశాల ప్రకారం వారిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలోని డీఅడిక్షన్ సెంటర్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఈ సందర్భంగా ఖమ్మం పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల వినియోగం, విక్రయం, రవాణా వంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100 / 112కు సమాచారం అందించాలని కోరారు.

# 'తక్కువ ధరకు బంగారం' పేరుతో రూ.85.70 లక్షల టోకరా

- **అంతర్రాష్ట్ర మోసగాళ్ల అరెస్ట్.. నకిలీ ఆధ్యాత్మిక వేషంతో ప్రజలను నమ్మించి మోసం**

**ఖమ్మం, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలంలో తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.85.70 లక్షలు వసూలు చేసి పరారైన ఇద్దరు అంతర్రాష్ట్ర మోసగాళ్లను కామేపల్లి పోలీసులు అరెస్టు చేశారు. సింగరేణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సాగర్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో నిందితులను అదుపులోకి తీసుకుని కీలక ఆధారాలను స్వాధీనం చేసుకున్నారు.

అరెస్టైన వారిలో బానోత్ సాయికుమార్ (20), కామేపల్లి మండలం బాసిత్‌నగర్‌కు చెందిన వ్యక్తి కాగా, ప్రధాన నిందితుడు నారాయణప్ప గురప్ప అలియాస్ ఆనంద్ రెడ్డి అలియాస్ హరిప్రసాద్ అలియాస్ బోగా లక్ష్మీనారాయణ (63) కర్ణాటక రాష్ట్రానికి చెందినవాడు.

పోలీసుల కథనం ప్రకారం, ప్రధాన నిందితుడు గతంలో పలు రాష్ట్రాల్లో ఉద్యోగాలు, భూములు, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని చెప్పి మోసాలకు పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లాకు వచ్చాక 'బోగా లక్ష్మీనారాయణ' పేరుతో అయ్యప్ప మాల ధరించి ఆధ్యాత్మిక వ్యక్తిగా ప్రజల మధ్య తిరుగుతూ నమ్మకం సంపాదించాడు. పూజలు, అన్నదానాలు, అయ్యప్ప, శబరిమల, ఏడుపాయల యాత్రలు, గ్రామాల్లో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తూ స్థానికుల విశ్వాసాన్ని పొందాడు.

ఆ విశ్వాసాన్నే పెట్టుబడిగా మార్చుకుని తన డ్రైవర్ బానోత్ సాయికుమార్‌తో కలిసి 2026 ఫిబ్రవరి నుంచి తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తామని చెప్పి ప్రజల నుంచి భారీగా నగదు వసూలు చేశాడు. తొలుత కొందరికి డబ్బులు తిరిగి ఇచ్చి నమ్మకం కల్పించి, అనంతరం పెద్ద మొత్తాల్లో డబ్బులు సేకరించి పరారయ్యాడు. కామేపల్లి మండలం, ఖమ్మం జిల్లా పరిసర ప్రాంతాలకు చెందిన 18 మంది బాధితుల నుంచి మొత్తం రూ.85.70 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. ఈ డబ్బును ధార్మిక కార్యక్రమాలు, అన్నదానాలు, యాత్రలు, స్థానిక దేవాలయ ఉత్సవాలు, ఛత్రపతి శివాజీ విగ్రహ ప్రతిష్ఠ, గ్రామస్తులకు అప్పులుగా ఇవ్వడం, విలాసవంతమైన జీవనం, గోవా పర్యటనలు, పాత అప్పులు తీర్చేందుకు ఖర్చు చేసినట్లు నిందితులు పోలీసులకు వెల్లడించారు.

మైనర్ బాలికకు సంబంధించిన మరో కేసు నేపథ్యంలో నిందితులు తిరుగుతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి మారుతి ఈకో కారు, రెండు మొబైల్ ఫోన్లు, 'బోగా లక్ష్మీనారాయణ' పేరుతో ఉన్న నకిలీ ఆధార్ కార్డు స్వాధీనం చేసుకున్నారు.

విచారణలో ప్రధాన నిందితుడు కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సంచరిస్తూ ప్రభుత్వ ఉద్యోగాలు, భూములు, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని చెప్పి కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడినట్లు, గతంలో జైలు శిక్ష కూడా అనుభవించినట్లు వెల్లడైంది.

తక్కువ ధరకు బంగారం, భూములు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ మోసగాళ్లు చేసే వలలో పడొద్దని, ఇలాంటి అనుమానాస్పద ఆఫర్లు ఎదురైతే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సింగరేణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సాగర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.







# మోస్ట్ వాంటెడ్ భూష్మి శ్రీకాంత్ నేర ముఠా గుట్టురట్టు

- **40 చోరీ కేసుల ఛేదన.. ఆరుగురు అరెస్ట్, ఇద్దరు పరారీలో**

**నల్గొండ, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

రెండు తెలుగు రాష్ట్రాల్లో వరుస చోరీలకు పాల్పడుతూ పోలీసులకు సవాల్‌గా మారిన మోస్ట్ వాంటెడ్ నేరస్థుడు భూష్మి శ్రీకాంత్ అలియాస్ అమ్మిరాజు ఏర్పాటు చేసిన అంతర్‌రాష్ట్ర చోరీ ముఠాను నల్గొండ జిల్లా పోలీసులు ఛేదించారు. ముఠాలోని ఆరుగురు సభ్యులను అరెస్టు చేయగా, మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ తెలిపారు. పట్టుబడిన నిందితుల నుంచి 260 గ్రాముల బంగారు ఆభరణాలు, 5 కిలోల వెండి ఆభరణాలు, రూ.1.50 లక్షల నగదు, రెండు టీవీలు, రెండు సౌండ్ బార్లు, ఐదు ద్విచక్ర వాహనాలు, ఏడు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. స్వాధీనం చేసుకున్న ఆస్తుల విలువ సుమారు రూ.53 లక్షలు ఉంటుందని తెలిపారు. విచారణలో భూష్మి శ్రీకాంత్ వైన్ షాపుల వద్ద యువకులతో పరిచయం పెంచుకుని, వారికి డబ్బులు ఖర్చు చేసి నమ్మకం సంపాదించిన తర్వాత చోరీల వైపు మళ్లించినట్లు తేలింది. తాళాలు పగులగొట్టడం, సీసీటీవీలను తప్పించుకోవడం, చోరీ చేసిన ఆస్తులను విక్రయించే పద్ధతులపై కూడా వారికి శిక్షణ ఇచ్చినట్లు పోలీసులు వెల్లడించారు. ప్రత్యేక పోలీసు బృందాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గాలింపు చేపట్టి ఈ ముఠాను అరెస్టు చేశాయి. వీరు తెలంగాణలో 28, ఆంధ్రప్రదేశ్‌లో 12 కేసులతో కలిపి మొత్తం 40 చోరీ కేసుల్లో పాల్గొన్నట్లు దర్యాప్తులో తేలింది. పలు కేసుల్లో లభించిన వేలిముద్రలు, సీసీటీవీ దృశ్యాల ఆధారంగా నిందితులను గుర్తించినట్లు ఎస్పీ తెలిపారు. నేరస్థులు ఎంత తెలివిగా వ్యవహరించినా చట్టం నుంచి తప్పించుకోలేరని, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, కచ్చితమైన దర్యాప్తుతో ప్రతి నేరస్థుడిని చట్టం ముందు నిలబెడతామని ఎస్పీ శరత్ చంద్ర పవార్ స్పష్టం చేశారు. యువత తప్పుడు ప్రలోభాలకు లోనై నేరాల బాట పట్టవద్దని సూచించారు.




# 'పోలీస్ అక్క'తో విద్యార్థినుల్లో భద్రతా చైతన్యం

- **మహిళల రక్షణకు చట్టాలు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించిన పోలీసులు**

**నల్గొండ, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

మహిళలు, బాలికల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా "పోలీస్ అక్క" అవగాహన కార్యక్రమాన్ని మహిళా పోలీసులు నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో జరిగిన ఈ కార్యక్రమంలో విద్యార్థినులకు మహిళల భద్రత, చట్టపరమైన హక్కులు, సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆకతాయిల వేధింపులు, ఈవ్‌టీజింగ్, ర్యాగింగ్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యక్తిగత వివరాలను అపరిచితులతో పంచుకోవడం వల్ల కలిగే ప్రమాదాలపై విద్యార్థినులకు వివరించారు. మహిళలు నిర్భయంగా విద్యను కొనసాగించేలా భద్రతా వాతావరణం కల్పించడమే "పోలీస్ అక్క" కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100, షీ టీమ్స్ లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రత కోసం పోలీసు శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా ఫిర్యాదు చేయాలని విద్యార్థినులకు భరోసా కల్పించారు. మహిళల రక్షణకు అమలులో ఉన్న చట్టాలు, హక్కులు, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన చర్యలపై కూడా అవగాహన కల్పిస్తూ, విద్యార్థినుల్లో చట్టాలపై అవగాహనతో పాటు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం ఉద్దేశమని పోలీసులు తెలిపారు.







## వికారాబాద్‌లో 30 కిలోల గంజాయి పట్టివేత

- **ఒడిశాకు చెందిన ఇద్దరు అరెస్ట్.. అంతర్రాష్ట్ర మాదకద్రవ్యాల నెట్‌వర్క్‌పై దర్యాప్తు**

**వికారాబాద్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

వికారాబాద్ జిల్లా పోలీసులు మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో 30 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఒడిశా రాష్ట్రానికి చెందిన ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు డీఎస్పీ అంజయ్య పర్యవేక్షణలో సీసీఎస్, టౌన్ పోలీసుల ప్రత్యేక బృందం ఈ ఆపరేషన్ నిర్వహించింది. వికారాబాద్ రైల్వే స్టేషన్ పరిసరాల్లో అనుమానాస్పదంగా సంచరిస్తున్న రామ్ హరి (43), కలాబాబు ఖాన్ (33)లను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా, వారి వద్ద మొత్తం 30 కిలోల గంజాయి లభించింది. ఇందులో కలాబాబు ఖాన్ వద్ద 9 కిలోలు, రామ్ హరి వద్ద 21 కిలోల గంజాయి ఉన్నట్లు పోలీసులు తెలిపారు. విచారణలో ఒడిశాలోని గంజాం జిల్లాకు చెందిన సునీల్ పాండీ అనే వ్యక్తి సూచనల మేరకు గంజాయిని హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాలకు సరఫరా చేస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. విక్రయాల ద్వారా వచ్చే లాభాల్లో వాటా తీసుకుంటూ రవాణా చేస్తున్నట్లు వెల్లడించారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు, ఈ అక్రమ రవాణా వెనుక ఉన్న ప్రధాన నిందితులు, నెట్‌వర్క్ సభ్యులను గుర్తించే పనిలో ఉన్నారు. డీఎస్పీ అంజయ్య మాట్లాడుతూ, మాదకద్రవ్యాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, గంజాయికి సంబంధించిన సమాచారం తెలిసిన ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ ఆపరేషన్‌లో ప్రతిభ కనబర్చిన పోలీసు బృందాన్ని జిల్లా ఎస్పీ అభినందించారు.



## ప్రజల భద్రతే పోలీసుల ప్రథమ కర్తవ్యం: ఎస్పీ నరసింహ

- **వారాంతపు పోలీస్ కవాతులో సిబ్బందికి దిశానిర్దేశం**

**సూర్యాపేట, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, బాధితులకు అండగా నిలవడంతో పాటు నేరస్థుల పట్ల కఠినంగా వ్యవహరించాలని సూర్యాపేట జిల్లా ఎస్పీ నరసింహ, ఐపీఎస్ సూచించారు. జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన వారాంతపు పోలీస్ కవాతును ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి శనివారం నిర్వహించే ఈ కవాతు ద్వారా పోలీస్ సిబ్బందిలో సమయపాలన, పరస్పర సమన్వయం, శారీరక దారుఢ్యం పెంపొందుతుందని ఎస్పీ తెలిపారు. విధి నిర్వహణలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంతో పాటు నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సిబ్బందికి విధి నిర్వహణలో లేదా వ్యక్తిగత జీవితంలో ఎలాంటి సమస్యలు ఉన్నా వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమానికి జిల్లా పోలీస్ యంత్రాంగం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఒత్తిడితో కూడిన పోలీసు విధుల్లో శారీరక, మానసిక ఆరోగ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం, యోగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పీలు, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, సీఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అందెశ్రీ స్ఫూర్తే ప్రజా ప్రభుత్వానికి శ్రీరామరక్ష"

- **అందెశ్రీ నాకు కవి మాత్రమే కాదు, పెద్దన్నలాంటి ఆత్మబంధువు.**
- **నేను సీఎం స్థాయికి రావడం వెనుక ఆయన గళం, స్ఫూర్తి ఉన్నాయి.**
- **అందెశ్రీ, గద్దర్ స్ఫూర్తితోనే మా ప్రభుత్వం నడుస్తోంది.**
- **తెలంగాణపై ఆధిపత్యం చెలాయించాలని చూస్తే మళ్లీ ఉద్యమకారులు పుడతారు.**
- **పార్టీలు చూడకుండా ఉద్యమ వీరుల కుటుంబాలకు కోటి రూపాయల ప్రజా సొమ్ము అందించాం.**

**ఘట్‌కేసర్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేయనున్న స్మృతి వనానికి ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అందెశ్రీ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, ఆయన కుటుంబ సభ్యుల సమక్షంలో భూమిపూజ నిర్వహించారు. సభలో మాట్లాడిన ముఖ్యమంత్రి, "అందెశ్రీ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు కవి, గాయకుడు, ఉద్యమకారుడిగా తెలిసి ఉండొచ్చు. కానీ నాకు మాత్రం ఆయన ఆత్మబంధువు. నేను ముఖ్యమంత్రిగా ఈ స్థాయికి రావడంలో ఆయన గళం, ఆయన స్ఫూర్తి ఎంతో పాత్ర పోషించాయి" అని భావోద్వేగంగా అన్నారు. తన కుటుంబంలో పెద్దన్నను కోల్పోయిన తర్వాత, అందెశ్రీ తనకు పెద్దన్నలాగా మారారని, ఆయనతో ఉన్న అనుబంధం జీవితాంతం మరువలేనిదని సీఎం తెలిపారు. తెలంగాణపై ఎవరైనా ఆధిపత్యం చెలాయించాలని ప్రయత్నిస్తే, ఆ గడ్డపై మళ్లీ అందెశ్రీలాంటి ఉద్యమకారులు పుడతారని హెచ్చరించారు. "అందెశ్రీ, గద్దర్ స్ఫూర్తితోనే ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. తెలంగాణ ఉద్యమంలో జీవితాలను అంకితం చేసిన ఉద్యమ వీరుల కుటుంబాలకు పార్టీ, జెండా చూడకుండా ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున అందించాం. అది నా సొమ్ము కాదు.. ప్రజల సొమ్ము" అని సీఎం పేర్కొన్నారు. అందెశ్రీ రచించిన "జయ జయహే తెలంగాణ", "మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు" వంటి పాటలు కేవలం గీతాలు కాదని, అవి ప్రజా చైతన్యాన్ని రగిలించిన ఉద్యమ ఫిరంగులని కొనియాడారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల గుండెల్లో నింపిన మహాకవిగా అందెశ్రీ చిరస్థాయిగా నిలిచిపోతారని సీఎం రేవంత్ రెడ్డి నివాళులర్పించారు.








## స్వచ్ఛాంధ్రకు భారీ ఊతం.. రూ.15,274 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- **120 పట్టణాల్లో ప్రజారోగ్య, మున్సిపల్ మౌలిక వసతుల విస్తరణ.. 8 సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్ల ప్రారంభం**

**గుడివాడ, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 120 పట్టణాల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు తెలిపారు. గుడివాడలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, పరిశుభ్రమైన రాష్ట్ర నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని ఎనిమిది ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను ప్రారంభించారు. అలాగే 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మూడు మున్సిపల్ కార్పొరేషన్లు, ఆరు మున్సిపాలిటీలకు అవార్డులు అందజేసి అభినందించారు. రానున్న రోజుల్లో మరో ఆరు వేస్ట్‌టుఎనర్జీ ప్లాంట్లను ప్రారంభించడం ద్వారా డంపింగ్ యార్డుల అవసరాన్ని పూర్తిగా తొలగించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. వ్యర్థాలను శక్తిగా మార్చే ఆధునిక విధానాలతో పర్యావరణ పరిరక్షణతో పాటు పట్టణాలను మరింత పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. పరిశుభ్రమైన పరిసరాలు ప్రభుత్వ చర్యలతోనే సాధ్యం కావని, ప్రజల భాగస్వామ్యం కూడా అంతే కీలకమని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర లక్ష్య సాధనలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని ఆయన పిలుపునిచ్చారు.




## ఎల్బీ నగర్ నారాయణ ఈటెక్నో స్కూల్‌లో ఘనంగా 'ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ'

**ఎల్బీనగర్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

ఎల్బీనగర్‌లోని నారాయణ ఈటెక్నో స్కూల్‌లో శనివారం 'ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ' (విద్యార్థి నాయకుల ప్రమాణ స్వీకార మహోత్సవం) అత్యంత వైభవంగా జరిగింది. "రేపటి నాయకులకు కిరీటధారణ" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థి ప్రతినిధులు బాధ్యతలను స్వీకరించారు. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా టీటీఐ ఎల్బీనగర్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి. సోమనాథం విచ్చేశారు. విద్యార్థి నాయకులకు బ్యాడ్జీలు తొడిగి, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథులుగా హాజరైన ఏజీఎం (డీఎన్ జోన్) ఎల్. హేమాంబర్, హెచ్‌ఎస్‌ఆర్&డి శివరంజని, హెచ్‌ఎస్ కోఆర్డినేటర్, ఈఛాంప్స్ కోఆర్డినేటర్ గాయత్రి, ఆర్‌ఎస్‌టీ రవితేజ, పాఠశాల ప్రిన్సిపాల్ హరిప్రసాద్, ఆర్‌ఐ రవిప్రసాద్.. విద్యార్థులను అభినందించారు. పాఠశాలలోని నాలుగు గ్రూపులు — అగ్ని, నాగ్, పృథ్వి, త్రిశూల్ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## ఆర్కేపురం నారాయణ పాఠశాలలో ఘనంగా విద్యార్థి సంఘం ఎన్నికలు

**ఆర్కేపురం:**












విద్యార్థుల్లో దాగి ఉన్న నాయకత్వ లక్షణాలను వెలికి తీసి, వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఆర్కేపురంలోని నారాయణ పాఠశాల యాజమాన్యం విద్యార్థి సంఘం ఎన్నికలను అత్యంత ఘనంగా నిర్వహించింది. ఈ ఎన్నికల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. హెడ్ బాయ్‌గా యాశ్వర్ధన్, హెడ్ గర్ల్‌గా యోగదా ఎన్నికవగా, 9వ తరగతి నుంచి జూనియర్ హెడ్ బాయ్‌గా లోకేశ్వర్ నాథ్ నాయుడు, 5వ తరగతి నుంచి జూనియర్ హెడ్ గర్ల్‌గా జోషిత ఎన్నికై పదవులను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సి.ఐ సైదులు గారు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. జీవితంలో ఏ రంగంలోనైనా రాణించాలన్నా, అనుకున్నది సాధించాలన్నా క్రమశిక్షణే అత్యంత కీలకమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థుల్లో నైతిక బాధ్యతలను పెంచేలా ఆయన చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. అనంతరం ఎన్నికల్లో గెలిచిన విజేతలకు బ్యాడ్జీలు తొడిగి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జీఎం గోపాల్ రెడ్డి, ఏజీఎం హేమంబార్, ఆర్‌ఐ రవి ప్రసాద్, ఆర్ అండ్ డి శివరంజని, మహేశ్వరి, మీనా, సమన్వయకర్తలు నరేష్, గాయత్రి, శిరీష, ప్రిన్సిపాల్ సమీనా, ఏడి స్వామినాథన్, వైస్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, నవ్య కీర్తి, ఏవో రమేష్ తదితరులు పాల్గొన్నారు. సుసంపన్నమైన సమ సమాజ నిర్మాణానికి, దేశానికి ఉత్తమ నాయకులను అందించేందుకు నారాయణ యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందని ఈ సందర్భంగా ప్రతినిధులు కొనియాడారు.

## మహిళల కోసం మరో ఇండస్ట్రియల్ పార్క్: సీఎం రేవంత్ రెడ్డి

- **FLO ప్రధాన కార్యాలయానికి 1,000 గజాల స్థలం కేటాయింపు**
- **ఫిక్కీకి ఫ్యూచర్ సిటీలో మరో ఎకరం.. మహిళల కోసం కొత్త ఇండస్ట్రియల్ పార్క్ పరిశీలన**

**హైదరాబాద్, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

రాష్ట్రంలో మహిళా సాధికారతకు ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం (FLO) ప్రధాన కార్యాలయ నిర్మాణం కోసం శిల్పారామం సమీపంలో వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన అన్ని విధాల సహకారం అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.

ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (FLO) ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత, పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహంపై ప్రతినిధులతో విస్తృతంగా చర్చించారు. హైటెక్ సిటీ, సీఐఐ కార్యాలయానికి మధ్యలో FLO ప్రధాన కార్యాలయం ఏర్పాటుతో ఆ ప్రాంతం దేశవ్యాప్తంగా మహిళా పారిశ్రామికవేత్తలకు కేంద్రంగా మారుతుందని సీఎం పేర్కొన్నారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ అభివృద్ధిలో ఫిక్కీ భాగస్వామ్యం కావాలని కోరుతూ, ఫిక్కీ ప్రధాన కార్యాలయం కోసం మరో ఒక ఎకరం స్థలాన్ని కూడా కేటాయిస్తామని వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ప్రపంచ ప్రఖ్యాత ఫార్చ్యూన్-500 కంపెనీలను తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ ప్రక్రియలో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. FLO ఆధ్వర్యంలో ఇప్పటికే విజయవంతంగా కొనసాగుతున్న మహిళల ఇండస్ట్రియల్ పార్క్ తరహాలో మరో పారిశ్రామిక పార్క్ ఏర్పాటు చేసే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. మహిళలు ఆర్థికంగా బలోపేతం అయితేనే రాష్ట్రం, దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్న సీఎం, మహిళా పారిశ్రామికవేత్తల సమస్యల పరిష్కారానికి ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక సమీక్ష సమావేశాలు నిర్వహిస్తామని హామీ ఇచ్చారు. వ్యాపార రంగంలో విశేష ప్రతిభ కనబరిచిన మహిళలను FLO ఆధ్వర్యంలో ప్రతి ఏడాది అవార్డులతో సత్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సీఎం సలహాదారు కె. రామకృష్ణారావు, FLO జాతీయ అధ్యక్షురాలు పూజా గార్గ్, FLO హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతా రెడ్డి గద్దం, పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.



## 'సీపీ కనెక్ట్'తో ఉత్తమ సేవలకు గుర్తింపు

- **అంకితభావంతో విధులు నిర్వర్తించిన 10 మంది పోలీసు సిబ్బందిని సన్మానించిన సీపీ రష్మి పెరుమాళ్**

**సిద్దిపేట, జూలై 18, ఆశ్వి అప్డేట్స్:**

పోలీస్ సిబ్బందిలో ఉత్తమ సేవలను గుర్తించి వారి మనోధైర్యాన్ని పెంపొందించే లక్ష్యంతో సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్, ఐపీఎస్ 'సీపీ కనెక్ట్' పేరుతో వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో విధుల్లో అసాధారణ ప్రతిభ కనబర్చిన పోలీసు అధికారులు, సిబ్బందిని వ్యక్తిగతంగా అభినందించి ప్రశంసాపత్రాలు, ప్రత్యేక గిఫ్ట్ కిట్‌లను అందజేయనున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా తొలి విడతలో వివిధ పోలీస్ స్టేషన్లకు చెందిన 10 మంది పోలీసు సిబ్బందిని సీపీ ప్రత్యేకంగా సత్కరించారు. ప్రాణాలను కాపాడటం, నేరాలను ఛేదించడం, కమ్యూనిటీ పోలీసింగ్‌లో ప్రతిభ చూపడం, ప్రజల భద్రత కోసం అంకితభావంతో పనిచేసిన సిబ్బందిని ప్రశంసించారు. రాయ్‌పోల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు నలుగురి ప్రాణాలను ఆత్మహత్య నుంచి కాపాడగా, చేర్యాల పోలీసులు అర్ధరాత్రి హాస్టల్ నుంచి బయటకు వచ్చిన బాలుడిని సురక్షితంగా వార్డెన్‌కు అప్పగించారు. గజ్వేల్ పోలీసులు ఒంటరిగా వెళ్తున్న మైనర్ బాలికను గుర్తించి తల్లిదండ్రులకు చేర్చగా, రాజ్‌గోపాల్‌పేట పోలీసులు దొంగిలించిన బోర్‌వెల్ వైర్‌తో ఉన్న నిందితుడిని పట్టుకున్నారు. చిన్నకోడూరు పోలీసులు సీసీటీవీ ఆధారాలతో దొంగను అరెస్టు చేసి రెండు ఆటోలు, రెండు స్కూటర్లను స్వాధీనం చేసుకున్నారు.

ఈ సందర్భంగా సీపీ రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ, 'సీపీ కనెక్ట్' కార్యక్రమం కేవలం అవార్డులు ఇవ్వడానికే కాదని, పోలీసు సిబ్బంది నిజాయితీతో చేసిన సేవలను గుర్తించి ప్రోత్సహించడమే ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అభినందించే సంస్కృతి పెంపొందితే సిబ్బందిలో బాధ్యత, నిబద్ధత మరింత పెరుగుతుందని, ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు.






# జొన్నరొట్టెలు తింటే ఎన్ని ప్రయోజనాలో!



**ఆధునిక కాలంలో ఫాస్ట్ ఫుడ్‌కు అలవాటు పడ్డ జనం.. మళ్లీ మన సాంప్రదాయ వంటల వైపు చూస్తున్నారు. నాడు మన పెద్దలు ఎంతో ఆరోగ్యమైన ఆహారం తిని 90 ఏళ్ల వరకు ఆరోగ్యంగా బతికితే నేడు జంక్ ఫుడ్ తింటూ ఈ తరం వాళ్లు 30 ఏళ్లకే ఎన్నో రోగాలబారిన పడుతున్నారు. ఈ నేపథ్యంలో మన పెద్దలు తిన్న జొన్న రొట్టెలపై పల్లె నుంచి పట్నం వరకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరమైన ఈ జొన్న రొట్టెల గురించి తెలుసుకుంటే మీరు కూడా వదిలి పెట్టరు. డైలీ రొటీన్ లో తినాల్సిన ఆహారంగా మార్చుకోవాల్సిన జొన్న రొట్టెల గురించి తెలుసుకుందాం రండి...**

జొన్నరొట్టెల్లో ఉన్న పోషకాలు, ఆరోగ్య ప్రయోజనాలు ఎంతో విలువైనవి. జొన్నలలో ప్రొటీన్లు, పీచు, పిండిపదార్థాలు, విటమిన్లు, కాపర్, ఐరన్, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం, జింక్, మాంగనీస్, సెలేనియం వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జొన్నల్లో విటమిన్ బి, బి3లు శక్తిని అందిస్తాయి. ఎనీమియాతో బాధపడేవారు జొన్న ఆహారం తీసుకోవడం వల్ల తక్షణ లాభం పొందవచ్చు. మధుమేహం ఉన్నవారు కూడా జొన్నలు వాడవచ్చు, ఎందుకంటే ఇవి కొలెస్ట్రాల్ స్థాయిని పెంచవు. బరువు తగ్గాలనుకునే వారు జొన్నరొట్టెలు తీసుకోవడం ఉత్తమం. జొన్నల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ, మరియు యాంటీ క్యాన్సర్ గుణాలు కూడా ఉన్నాయి, ఇవి వ్యాధులను నిరోధిస్తాయి. జొన్నలతో తయారు చేసిన ఆహారం ఎముకలను బలంగా ఉంచుతుంది, వెన్ను దృఢంగా ఉంటుంది, నడుం నొప్పులు తగ్గుతాయి. బి6 విటమిన్ నరాల వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది, ఉద్వేగాలను నియంత్రించడంలో సహాయపడుతుంది,శరీరంలో రక్త ప్రవాహాన్ని మెరుగుపరుస్తుంది. జీర్ణవ్యవస్థ కూడా మెరుగుపడుతుంది, మలబద్ధక సమస్యలు తలెత్తవు. బరువు తగ్గాలనుకునే వారు జొన్నలతో చేసిన ఆహారం చాలా ఉపయోగకరమైంది. జొన్నలతో మనం సాధారణంగా తినే రొట్టెలతో పాటు ఉప్మా, పొంగల్, పూరీ, ఊతప్పమ్, ముథియాస్, షీరా, తాలీపీఠ్, గోల్‌పాప్టీ, ప్యాన్‌కేక్, ప్యాజ్ కీ రోటీ, బ్రెడ్ స్టిక్స్ వంటి వందకు పైగా రకాల వంటకాల్ని తయారు చేయవచ్చు. ఇవి ఆరోగ్యకరంగా ఉంటాయి, రుచిగా కూడా ఉంటాయి. జొన్నఅన్నం వరి కంటే చాలా మంచిది. ఇంకెందుక ఆలస్యం... మీ రోజువారీ ఆహారంలో జొన్నలను చేర్చుకోండి మరి!

# మంచి ఆహారంతోనే 'పొట్ట' పదిలం!

**మనం రోజూవారీగా తీసుకునే ఆహారం మన ఆరోగ్యాన్ని ఎంతో ప్రభావితం చేస్తుంది. ఈ క్రమంలో మనం ఏది పడితే అది తిని మన పొట్టను ఇబ్బంది పెట్టడం ఎంతమాత్రం సరికాదు. మన రోగ నిరోధక వ్యవస్థ బాగుండాలన్నా, మనం ఉత్సాహంగా మన పనులు చేసుకోవాలన్నా మన జీర్ణ వ్యవస్థ సక్రమంగా ఉండాలి. దీని కోసం మంచి ఆరోగ్యకరమైన అలవాట్లు పాటించడం అవసరం.**



### ఫైబర్‌తో ఎంతో మేలు:

ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు పొట్టకు ఎంతో శ్రేయస్కరం. మొరంగడ్డ, పాలకూర, బీట్‌రూట్, క్యారట్ లాంటి ఆహారాల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. తాజా పండ్లలో కూడా ఫైబర్ అధికంగా ఉంటుంది. ఫైబర్ జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది, మలబద్ధక సమస్యలను నివారిస్తుంది.

### ప్రొబయోటిక్ పదార్థాలు:

యోగర్ట్, పెరుగు వంటి ప్రొబయోటిక్ పదార్థాలు పొట్టలో మంచి బ్యాక్టీరియా అభివృద్ధికి సహాయపడతాయి. వీటితో పొట్టలో ఉన్న మంచి సూక్ష్మజీవులు పెరిగి, జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తాయి.

### మొలకలు :

మొలకలు కూడా మన రోజూవారీ భోజనంలో ఉండేలా చూసుకోవాలి. నాన బెట్టిన మొలకలతో ప్రొటీన్లు సమృద్ధిగా అందుతాయి.మనకు కావాల్సిన ఎన్నో పోషకాలను పొందవచ్చు.

### వ్యాయామం:

వ్యాయామం శరీరాన్ని మాత్రమే కాకుండా పొట్టను కూడా ఆరోగ్యంగా ఉంచుతుంది. ప్రతిరోజు కొంత వ్యాయామం చేస్తే, జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది.

### మానసిక ఆరోగ్యం:

పొట్టను 'రెండో మెదడు' అని పిలవడం అతిశయోక్తి కాదు. మన ఆరోగ్యం పొట్టమెదడు అనుసంధానంపై ఆధారపడి ఉంటుంది. మానసిక ఒత్తిడిని తగ్గించడం, చక్కగా నిద్రపోవడం, మానసిక ప్రశాంతత కాపాడుకోవడం కూడా ముఖ్యమే.

### మద్యపానం నివారణ:

అతిగా మద్యం తాగడం పొట్టలోని మంచి సూక్ష్మజీవులకు చెడు చేస్తుంది. కాబట్టి, మద్యపానాన్ని దూరంగా ఉంచడం మంచిది.

### మార్పులు గమనించండి :

మల విసర్జనలో మార్పులు, అసాధారణ బరువు తగ్గడం, మలద్వారం నుంచి రక్తం పోవడం వంటి లక్షణాలను గమనించాలి. ఈ పరిస్థితుల్లో సంబంధిత వైద్యులను సంప్రదించి, సరైన చికిత్స పొందడం ముఖ్యం.



# ఇవి తాగితే స్లిమ్ అవ్వడం గ్యారం 'టీ'!

ప్రస్తుత కాలంలో ఎంతోమంది ఎదుర్కొనే సమస్యల్లో అధిక బరువు ఒకటి. అందంగా కనిపించాలన్నా, నలుగురిలో స్పెషల్ గా ఉండాలన్నా స్లిమ్ గా ఉండాల్సిందేనని చాలా మంది అభిప్రాయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కడుపు మాడ్చుకునే వారికి ఆరోగ్య నిపుణులు పలు సూచనలు చేస్తున్నారు. స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి కొన్ని పానీయాలను జీవన శైలిలో జోడించుకోమని సలహా ఇస్తున్నారు. బరువు తగ్గడానికి ప్రయత్నించే ఎంతోమందికి ఈజీగా బరువు తగ్గే మార్గం మీ కిచెన్ షెల్ఫ్‌లోనే ఉందంటూ చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని వంటకాల్లో ఉపయోగించే సుగంధ ద్రవ్యాలలో పసుపు ఒకటి. కానీ పసుపు మసాలాగా కాకుండా బరువు తగ్గడంలో సహాయపడే కొన్ని అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది.ముఖ్యంగా స్థూలకాయాన్ని తగ్గించుకోవడానికి పసుపును తీసుకోవడం మంచిది. ముఖ్యంగా స్థూలకాయముండేవారికి సాధారణంగా డయాబెటిస్ ముప్పు ఉంటుంది. పసుపు ఉపయోగించడం వల్ల డయాబెటిస్‌కు చెక్ పెట్టడమే కాకుండా ఆరోగ్యానికి చాలా ప్రయోజనం కలుగుతుంది.. పసుపులో ఉండే ఫెనోల్‌లో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఒబెసిటీ గుణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరంలోని వైట్ ఎడిపోజ్ టిష్యూలో వాపు తగ్గించేందుకు పనిచేస్తాయి.



### పసుపు పాలు:

పాలలో కొద్దిగా పసుపు కలిపి తీసుకుంటే బరువు తగ్గడానికి, ఆరోగ్యంగా ఉండటానికి చాలా సహాయపడుతుంది. ఇది జలుబు మరియు దగ్గును నివారిస్తుంది. మీ రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు పసుపు పాలు తాగడం వల్ల ఎంతో ప్రయోజనం ఉంటుంది.

### అల్లంతో పసుపు టీ:

యాంటీ ఆక్సిడెంట్లు, మూలికల గొప్ప మూలమైన అల్లం బరువు తగ్గడానికి ఉపయోగపడుతుంది. తరిగిన అల్లం వేసి నీటిని మరిగించాలి. తరవాత అందులో కాస్త పసుపు వేసి కాసేపు అలాగే ఉంచాలి. దీన్ని వడకట్టవచ్చు..లేదా అలాగే తాగవచ్చు. దీన్ని రోజూ తాగడం వల్ల బరువు తగ్గుతారు. అల్లం ఆకలిని తగ్గించడంలో సహాయపడుతుంది





### తేనెతో పసుపు టీ:

తేనెతో పసుపు టీ బరువు తగ్గించేందుకు సహాయపడే ఓ గొప్ప పానీయం. తేనె ఆకలిని తగ్గించడంలో సహాయపడుతుంది. తేనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు కూడా ఉన్నాయి. ఇవి ఎఫెక్టివ్‌గా బరువు తగ్గడంలో సహాయపడతాయి.

### దాల్చిన చెక్కతో పసుపు టీ:

దాల్చిన చెక్క బరువు తగ్గడానికి చాలా సహాయపడుతుంది. పసుపు టీలో కొంచెం దాల్చిన చెక్కను జోడించడం వల్ల బరువు తగ్గడానికి మరింత మేలు చేస్తుంది.







# ఇలా చేస్తే దంతాలు మెరవాల్సిందే!



ఒక మనిషిలో ఎదుటు వారిని ఎక్కువగా ఆకట్టుకునేది అందం... ఎంత గొప్పగా తయారైనా అందంగా కనిపించాలంటే మన నవ్వు కచ్చితంగా బాగుండాలి. చక్కని నవ్వు అందాన్ని పెంచుతుంది. నవ్వు అందంగా కనిపించాలంటే ఇక దంతాలూ అందంగా ఉండాల్సిందే. కానీ కొంతమందికి కొన్ని కారణాల వల్ల దంతాలపై మరకలు పడుతుంటాయి. వాటిని దూరం చేసుకోవాలంటే ఏం చేయాలో తెలుసుకోండి. ఈ చిట్కాలు గనక పాటిస్తే మీ దంతాలు తలతల మెరవడం గ్యారంటీ!

## వీటితో పళ్లు తోమితే మరకలు మాయం..

దంతాలు అందంగా కనిపించాలంటే కొన్ని టిప్స్ పాటించాలి. వీటిని పాటిస్తే పళ్లు తెల్లగా మారి అందంగా కనిపిస్తాయి. వీటితో పాటు ఆరోగ్యంగా కూడా ఉంటాయి.అందుకే బద్ధకాన్ని వదిలి కనీసం రోజుకి రెండు సార్లు పళ్లు తోముకోవాలి. రాత్రి భోజనం తర్వాత కచ్చితంగా బ్రష్ చేయాలి. ఆయిల్ పుల్లింగ్, మౌత్ వాష్‌తో పుక్కిలించడం వల్ల దంతాలను ఎక్కువ కాలం తెల్లగా ఉంచుకోవచ్చు. అదే విధంగా పళ్లపై ఉన్న మరకలు పోవాలంటే ఏం చేయాలో తెలుసుకోండి.

### వైట్ వెనిగర్..

వైట్ వెనిగర్‌లో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు దంతాల మీద మరకలు, మురికి, గోధుమ రంగు మచ్చల్ని దూరం చేస్తాయి. అలాగే వెనిగర్‌లోని ఎసిటిక్ యాసిడ్ పంటి ఎనామిల్‌ని రక్షిస్తుంది.

**తయారీ విధానం....**

అరకప్పు నీటిలో 2 చెంచాలా వెనిగర్, 1 చెంచా ఉప్పు కలపాలి. ఆ నీటితో రోజుకి రెండు సార్లు పుక్కిలిస్తే దంతాలు, నోటిలోని క్రిములు, మరకల్ని దూరం చేయొచ్చు.





### జామతో..

జామ పండు, దాని ఆకులు సహజంగా దంతాలపై మరకలని తొలగిస్తుంది. ఇందులోని యాంటీ మైక్రోబియల్, యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు చిగుళ్ల వాపు, దంతాల ఇన్ఫెక్షన్‌స్‌ని తగ్గించి దంతాలకు రక్షణని అందిస్తాయి. రోజూ రెండు జామ ఆకులను తీసుకొని శుభ్రం చేసి నమిలి ఉమ్మివేయాలి. ఇది దంతాలపై ఏర్పడే మరకల్ని దూరం చేస్తుంది. అదే విధంగా జామ కాయపై ఉప్పు చల్లి రోజుకి ఒకటి రెండు సార్లు నమిలి రసాన్ని మింగితే పంటి నొప్పి, సమస్యలు తగ్గుతాయి.

### కలబంద గుజ్జు..

కలబంద గుజ్జు దంతాలపై మరకల్ని దూరం చేస్తుంది. కలబంద గుజ్జులో కొన్ని పదార్థాలను కలిపి రుద్దితే మరకలు కొద్ది రోజుల్లోనే మాయమవుతాయి.

**తయారీ విధానం....**

పావు కప్పు నీటిలో 2 చెంచాల కలబంద గుజ్జు, 4 చెంచాలా గ్లిజరిన్, 4 చెంచాలా బేకింగ్ సోడా, 1 చెక్క నిమ్మరసం కలపాలి. దీంతో రోజూ దంతాలపై రుద్ది నీటితో పుక్కిలిస్తే పళ్లపై ఉన్న మరకలు పోతాయి.



### నారింజ తొక్క..

దంతాలపై తీవ్రమైన మరకలు దూరం చేసేందుకు నారింజ తొక్కను చాలా బాగా ఉపయోగపడుతుంది. తాజా నారింజ తొక్కతో దంతాలపై రుద్దితే మరకలు పోతాయి. తాజా నారింజ తొక్కల్ని గ్రైండ్ చేసి ఆ స్క్రబ్‌ని దంతాలపై రుద్దితే మరకలు క్రమక్రమంగా దూరమవుతాయి.



### బేకింగ్ సోడా..

బేకింగ్ సోడా వాడితే దంతాల మరకలు తొలగించేందుకు దోహదపడుతుంది. ఇందు కోసం టూత్‌పేస్టులో ఓ స్పూన్ బేకింగ్ సోడా, కొద్దిగా ఉప్పు కలిపి దంతాల మీద రుద్దడం వల్ల దంతాల మరకలు దూరమవుతాయి. ఈ బేకింగ్ సోడా మిశ్రమంతో పళ్లని తోముకొని ఆపై గోరువెచ్చని నీటితో పుక్కిలించాలి.



# మునగాకు ప్రయోజనాలు తెలిస్తే వదలరు!



సాంబారులో మునక్కాయలంటే అందరికీ ఇష్టమే... కానీ మునగాకు కూర ఎంతమంది తింటుంటారు? ఒకప్పుడు మన పెద్దలు రకరకాలుగా మునగాకును ఆహారంలో భాగం చేసుకున్నారు. పప్పుల్లో, కూరగా, వేపుడుగా చాలా రకాలుగా తినేవారు. ఇది ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. మనకు ప్రకృతి ప్రసాదించిన అద్భుతమైన చెట్లలో మునగ చెట్టు ఒకటి. మునగ కాయలతో పాటు, ఆకుల్లోనూ అద్భుతమైన ఆరోగ్య ఔషధాలు ఉన్నాయని పలు పరిశోధనల్లో వెల్లడైంది. మునగాకు ఎన్నో ఆరోగ్య సమస్యలను నయం చేయడానికి ఇవి దివ్య ఔషధంలా పని చేస్తుందని ఆయుర్వేదం చెబుతోంది.

### ఔషధ గుణాలు పుష్కలం...

ఆయుర్వేదంలో మునగాకుకు ఓ ప్రత్యేక స్థానం ఉంది. దీనిని అమృతంలా పరిగణిస్తారు. ఎందుకంటే మునగాకుకు వందలాది జబ్బులను నయం చేసే శక్తి ఉంది. దీని ఆకులు, కాడలను కూరగాయలుగా ఉపయోగిస్తారు. ఔషధ గుణాలు పుష్కలంగా ఉన్న మునగ.. రక్తంలో షుగర్ లెవల్స్‌ను నియంత్రిస్తుంది. దీన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి.

### పోషకాల గని....

ఎన్‌సీబీఐ నివేదిక ప్రకారం.. మునగ ఆకుల్లో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, ఐరన్, విటమిన్‌ఎ, సి, బి కాంప్లెక్స్, బీటాకెరోటిన్, అమైనో యాసిడ్స్, ఫినోలిక్‌లతో పాటు, 40 కంటే ఎక్కువ రకాల యాంటీఆక్సిడెంట్లు ఉన్నాయి.

### ఇతర ఆహారపదార్థాలతో పోలిస్తే:

- క్యారెట్లు తినడం ద్వారా వచ్చే విటమిన్ ఎ 10 రెట్లు అధికంగా మునగాకు ద్వారా పొందొచ్చు.
- నిమ్మకాయలో ఉండే దాని కంటే 5 రెట్లు ఎక్కువ విటమిన్ సి కలిగి ఉంటుంది.
- పాల నుంచి లభించే క్యాల్షియం కన్నా.. మునగాకు నుంచి 17 రెట్లు అధికంగా లభిస్తుంది.
- పెరుగు తినడం వల్ల లభించే ప్రొటీన్ల కన్నా.. మునగాకు నుంచి 8 రెట్లు అధికంగా పొందవచ్చు.
- అరటిపండ్ల నుంచి పొందే పొటాషియం కన్నా.. ఎండిన మునగాకులో 15 రెట్లు అధికంగా ఉంటుంది.

### మునగాకు తినడం వల్ల ప్రయోజనాలు:



- మునగ ఆకులు విటమిన్ Cని కలిగి ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది.
- మునగాకులోని ఔషధ గుణాలు జుట్టు రాలడం, ఉబ్బసం, కీళ్లనొప్పులు వంటి సాధారణ వ్యాధులకు చికిత్స చేయడంలో ఉపయోగపడతాయి.
- ఈ ఆకులు ఊబకాయం, బరువు తగ్గడంలో కూడా సహాయపడతాయి.
- డయాబెటిస్‌తో బాధపడేవారికి కూడా ఇది ప్రయోజనకరంగా ఉంటుంది.
- పరిగడుపున ఈ ఆకులను తీసుకోవడం వల్ల శరీరంలో బ్లడ్ షుగర్ లెవెల్ కంట్రోల్ అవుతుంది.
- మునగ ఆకులు ఎముకలకు అవసరమైన కాల్షియం, మెగ్నీషియం అందిస్తాయి.
- ప్రతిరోజూ మునగాకుల రసాన్ని తాగడం వల్ల శరీరంలోని హానికరమైన బ్యాక్టీరియా మూత్రం ద్వారా బయటకు వెళ్లిపోతుంది.
- మునగ ఆకులను తీసుకోవడం వల్ల కడుపు నొప్పి, అల్సర్ వంటి అనేక కడుపు సంబంధిత సమస్యలను నయం చేయవచ్చు.
- ఇందులో ఉండే పీచు, జీర్ణవ్యవస్థతో పాటు పొట్టను ఆరోగ్యంగా ఉంచి, ఆరోగ్యకరమైన ప్రేగు కదలికకు కూడా దోహదపడుతుంది.



| వంద గ్రాముల మునగాకులో ఉండే పోషకాలు |
|---|
| నీరు: 75.9 శాతం |
| పిండి పదార్థాలు: 13.4 గ్రా |
| కొవ్వులు: 17 గ్రా |
| మాంసకృత్తులు: 6.7 గ్రా |
| కాల్షియం: 440 మిల్లీగ్రా |
| పాస్ఫరస్: 70 మిల్లీగ్రా |
| ఐరన్: 7 మిల్లీగ్రా |
| విటమిన్ సి: 200 మిల్లీగ్రా |
| ఖనిజ లవణాలు: 2.3 శాతం |
| పీచు పదార్థం: 0.9 మిల్లీగ్రా |
| శక్తి: 97 కేలరీలు |



## జాన్వీ కపూర్ తమిళ ఎంట్రీ ఫిక్స్!


బీటౌన్ బ్యూటీ జాన్వీకపూర్ ఇప్పటికే..'దేవర', 'పెద్ది' చిత్రాలతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన విషయం తెలిసిందే. రెండు సినిమాల్లోని జాన్వీ పాత్ర గ్లామర్‌కే అంకితం కావడంతో ఫ్యాన్స్ నిరుత్సాహం చెందారు. ఇదిలా ఉంటే.. ఇప్పుడు ఈ అమ్మడు కోలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది. ఈ మేరకు వెబ్‌సిరీస్‌తో జాన్వీ తమిళం ఇండస్ట్రీ ఎంట్రీ ఇవ్వడం విశేషం. 'కురథి' అనే టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ వెబ్‌సిరీస్‌కు తమిళ టాప్ డైరెక్టర్ పా రంజిత్ నిర్మించబోతుండగా.. సర్జునమ్ దర్శకత్వం వహించనున్నారని ఇప్పటికే వార్తలు రాగా దీనిపై అఫీషియల్ అనౌన్స్‌మెంట్ మాత్రం రాలేదు. ఈ క్రమంలోనే తాజాగా కురథి వెబ్ సిరీస్‌కు సంబంధించిన ఓ ఇంట్రెస్టింగ్ అప్డేట్ వచ్చింది. ఈ తమిళ ఒరిజినల్ సిరీస్ నిర్మాణాన్ని ప్రారంభించడానికి నెట్‌ఫ్లిక్స్ సిద్ధమైందని సమాచారం. దీంతో త్వరలోనే వెబ్‌సరీస్‌పై అఫీషియల్ అప్డేట్ రావడంతో పాటు షూటింగ్ కూడా స్టార్ట్ చేయనున్నారట మేకర్స్.



## ఓటీటీలోకి 'బాలన్ - ది బాయ్'.. స్ట్రీమింగ్ ఎక్కడంటే!

'మంజుమ్మల్ బాయ్స్' చిత్రంతో మలయాళంతో పాటు తెలుగులోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు చిదంబరం. ఆయన దర్శకత్వంలో వచ్చిన చిత్రం 'బాలన్ ది బాయ్' (Balan The Boy). చందు సలీమ్ కుమార్, టొవినో థామస్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమా ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ సినిమా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జులై 31 నుంచి జీ5 వేదికగా స్ట్రీమింగ్ కానుంది. మలయాళంతో పాటు తెలుగు, హిందీ, తమిళ, కన్నడ భాషల్లో అందుబాటులోకి రానుంది. హత్య కేసులో జైలుకు వెళ్లిన మహిళ అక్కడ ఓ అబ్బాయికి జన్మనిస్తుంది. శిక్ష పూర్తయి బయటకు వచ్చాక తన గతం గురించి ఎవరికీ చెప్పకుండా మారుపేర్లతో అన్ని ప్రాంతాలు తిరుగుతూ ఉంటుంది. కల్లోలభరితమైన బాల్యం, ఆ తర్వాత అదృశ్యమైన తన తల్లి కోసం వెతుకుతున్న ఒక టీనేజ్ అబ్బాయి కథగా 'బాలన్ ది బాయ్' రూపొందింది. మే నెలలో జరిగిన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ ఈ చిత్రాన్ని ప్రదర్శించారు. సినీ ప్రముఖులు సూర్య, నాగచైతన్య తదితరులు ఈ సినిమాపై ప్రశంసలు కురిపించారు.

## టాక్సిక్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ ఎప్పుడు ఎక్కడ, అంటే?



కన్నడ రాకింగ్ స్టార్ యష్ నుంచి వస్తున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'టాక్సిక్'. ఇందులో నుంచి ఇప్పటికే వచ్చిన గ్లింప్స్, టీజర్, సాంగ్స్‌తో పాటు.. రీసెంట్‌గా లేడీస్ అండ్ లేడీస్ అంటూ రిలీజ్ చేసిన స్పెషల్ గ్లింప్స్ సినిమాపై విపరీతమైన హైప్‌ను క్రియేట్ చేసింది. ఇప్పుడు ఇదే జోష్‌తో 'టాక్సిక్' టీమ్ ప్రమోషన్స్‌లో జోరు పెంచి అదిరిపోయే అప్డేట్‌ను ఇచ్చింది. ఈ మేరకు ఈ సినిమా ట్రైలర్‌కు ముహూర్తం ఫిక్స్ చేశారు మేకర్స్. ట్రైలర్‌ను ఆగస్టు 8న బెంగళూరులో జరిగే ఒక భారీ కార్యక్రమంలో విడుదల చేయనున్నట్లు టాక్. ఈ ట్రైలర్‌తో సినిమాపై ఉన్న అంచనాలు తదుపరి స్థాయికి చేరుకుంటాయని అభిమానులు ఆశిస్తుండగా.. ప్రజెంట్ ఇందుకు సంబంధించిన పోస్టులు వైరల్ అవుతున్నాయి. కాగా.. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తుండగా.. నయనతార, హూమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ అంచనాల మధ్య ఈ మూవీ ఆగస్టు 26న తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ, ఇంగ్లీష్ భాషల్లో ఏకకాలంలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది.

## గ్లామర్ డోస్ పెంచిన శృతి హాసన్..

మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ టాలెంటెడ్ నటి శృతి హాసన్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. తెలుగు చిత్ర పరిశ్రమలో ఎన్నో విజయవంతమైన సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ అందాల భామ, కోలీవుడ్‌లోనూ తనదైన ముద్ర వేసుకుంది. ఇటీవల విడుదలైన పెద్ది సినిమాలో ఐటెం సాంగ్‌లో మెరిసిన శృతి, తన స్టైలిష్ డ్యాన్స్‌తో పాటు గ్లామర్‌తో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. సినిమాలతో పాటు సోషల్ మీడియాలోనూ శృతి హాసన్ ఎంతో యాక్టివ్‌గా ఉంటూ తరచూ తన లేటెస్ట్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది. తాజాగా ఆమె ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. పర్పుల్-మెరూన్ కలర్ కాంబినేషన్‌లో ఉన్న చీరను ధరించిన శృతి, దానికి సరిపోయే బ్లౌజ్‌తో స్టైలిష్‌గా కనిపించింది. సైడ్ యాంగిల్‌లో నడుమందాలు హైలెట్ అయ్యేలా ఇచ్చిన పోజుల్లో ఆమె లుక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నుదిటిపై చిన్న బొట్టు, పెద్ద ఇయర్‌రింగ్స్ ఆమె అందాన్ని మరింత హైలైట్ చేశాయి. మొత్తంగా శృతి హాసన్ లేటెస్ట్ ట్రెడిషనల్ గ్లామర్ లుక్ అభిమానులను ఆకట్టుకుంటూ సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది.





## రష్మిక విజయ రహస్యం అదే.. నిబద్ధతపై బృందా మాస్టర్ ప్రశంసలు

అగ్ర నటి రష్మికపై డ్యాన్స్ కొరియోగ్రాఫర్ బృందా మాస్టర్ ప్రశంసలు కురిపించారు. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో తెరకెక్కుతోన్న తాజా చిత్రం 'మైసా'(Mysaa). ఇందులో బృందా ఒక సాంగ్ కోసం పని చేశారు. ఆ పాట షూటింగ్ సమయంలో రష్మిక కష్టాన్ని కొనియాడుతూ ఆమె ఇన్‌స్టాలో ఇటీవల ఒక పోస్ట్ పెట్టారు. " 'మైసా'లో ఒక సాంగ్‌కు పని చేయడం సంతోషంగా ఉంది. ఆ పాట కోసం రష్మిక చేసిన సాధన నిజంగా అద్భుతం. చిత్రపరిశ్రమలో ఇంత శ్రమపడే, క్రమశిక్షణ, పట్టుదల ఉన్న హీరోయిన్‌ని చూడడం ఇదే తొలిసారి. నేను ఏ కరెక్షన్ ఇచ్చినా, రష్మిక నవ్వుతూ సరిదిద్దుకుంటారు. షూటింగ్‌లో ఎప్పుడూ ఏకాగ్రతతో ఉంటారు. ఆమె సాధిస్తున్న విజయాలకు తన నిబద్ధతే కారణం. ఆ కష్టాన్ని ప్రేక్షకులు తప్పకుండా గుర్తిస్తారు. మైసాలో రష్మిక సృష్టించిన మ్యాజిక్‌ను ప్రపంచం చూడడం కోసం నేను ఎదురుచూస్తున్నాను " అని బృందా రాసుకొచ్చారు. ఈ సినిమా కథ ఆదివాసీ ప్రాంతాల నేపథ్యంలో సాగుతుంది. ఈ సినిమా కోసం మునుపెన్నడూ లేనివిధంగా రష్మిక శ్రమిస్తున్నారని దర్శకుడు తెలిపిన విషయం తెలిసిందే. యదార్థ సంఘటనల ఆధారంగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఆమె గోండు తెగకు చెందిన మహిళగా కనిపించనున్నారు. ఈ సినిమా కోసం సవాలుతో కూడిన స్టంట్స్ చేసిన నటి.. ఇటీవల అండర్ వాటర్ సీక్వెన్స్‌ను పూర్తి చేశారు. ఈ మూవీలో తారక్ పొన్నప్ప కీలక పాత్రలో పోషిస్తున్నారు. ఇక రష్మిక తదుపరి ఆమె భర్త విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి'లో కనిపించనున్నారు.

PRINTED AT SMILYS ONLINE #6-7-48, SHOPPING COMPLEX, VANSTHALIPURAM,RANGA REDDY, TELANGANA - 500070,
PUBLISHER, EDITOR SHOBHA RANI KASOJU PRGI NO : TGMUL/26/A2874, PHONE NO: 7207282727,7207292727
editor@aashwi.in www.aashwi.net, www.aashwi.in SHOBHA PUBLICATION'S